## కలెక్టర్ వెంకటేశ్వర్‌కు గంగమ్మప్రసాదాలు

తిరుపతి, మే 21 ప్రభాతవార్త:



తాతయ్యగుంట గంగమ్మ జాతర ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించడంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్‌కు ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. జాతర విజయవంతం వెనుక జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అందించిన సహాయ సహకారాలకు ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఈఓ ఎ.జయకుమార్, కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం
వార్త 30 వార్షికోత్సవం
1996 - 2026

## గాలివాన బీభత్సం



గాలివానకు రాలిన మామిడికాయలు, గాలికి ధ్వంసమైన రేకుల షెడ్డు

విజయపురం, మే 21 ప్రభాతవార్త:
విజయపురం మండలంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో గాలివానకు మామిడికాయలు, రేకుల షెడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గాలివానకు విద్యుత్ సరఫరా కట్ చేశారు.

# ఏడుకొండలవాడా... ఎక్కడున్నావయ్యా!

## కొండంత జనం... బారులుతీరినా క్యూలైన్లోకి నిలుపుదల





తిరుమల,మే 21ప్రభాతవార్తప్రతినిధి:
వేసవి రద్దీ నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా నెలకొనడంతో ఉదయం నుండి నేటి ఉదయం 10గంటల వరకు వెలుపల క్యూలైన్లలోనికి భక్తులను అనుమతించడం నిలుపుదలచేశారు. పెరిగిన రద్దీతో భక్తుల సౌకర్యార్థం టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు బాటగంగమ్మ సర్కిల్ నుండి గోగర్భం డ్యామ్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్ వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2, మ్యూజియం ప్రాంగణం, నారాయణగిరి ఉద్యానవనాల్లో నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో వేచి ఉండే భక్తుల కోసం కూల్ పెయింటింగ్ పనులు, అదనపు తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయం పరిసరాలు, లడ్డూ కౌంటర్లు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో చలువ పందిళ్ల నిర్మాణం చేపట్టారు. బాట గంగమ్మ గుడి సర్కిల్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన క్యూలైన్లలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. శ్రీవారి సేవకుల ద్వారా క్యూలైన్లలోని భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఉదయం అల్పాహారంగా పాలు ఉప్మా, పొంగల్, మధ్యాహ్నం సాంబారన్నం, పులిహోర, టమోట రైస్, రాత్రి పాలు ఉప్మా, సాంబారన్నం భక్తులకు నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నారు. టిటిడి ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు మొబైల్ వాటర్ డ్రమ్ములతో ఎప్పటికప్పుడు తాగునీరు పంపిణీ జరుగుతోంది. రద్దీకి అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డులో క్యూలైన్ల వెంబడి ఒక మొబైల్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అందుబాటులో ఉంచడం జరిగింది. తిరుమలలో పరిమిత సంఖ్యలో వసతి గదులు నిర్మించబడ్డాయి. 60వేల మంది భక్తులకు మించి తిరుమలలో వసతి కేటాయించడానికి వీలుపడదు. ప్రస్తుతం తిరుమలలో దాదాపు 7,500 గదులు, ఐదు యాత్రికుల వసతి సముదాయాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. గదులు పొందలేని భక్తులు తిరుమలలోని పీఏసీ1, పీఏసీ2, పీఏసీ3, పీఏసీ (పద్మనాభ నిలయం), పీఏసీ5 లలో ఉన్న దాదాపు తొమ్మిదివేల లాకర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ కూడా భక్తులతో కిక్కిరిసి ఉన్నాయి. గత ఐదు రోజుల్లోనే 4,32,213 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. ఇందులో అత్యధికంగా మే 16, 17వ తారీఖుల్లో 90 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. గత ఐదురోజుల్లో తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. అత్యధికంగా మే 18, 19, 20వ తారీఖుల్లో 43 వేలకు పైగా భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించడం విశేషం. అదే విధంగా గత ఐదురోజుల్లో తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 19 లక్షలకు పైగా భక్తులకు అన్న ప్రసాదాలు, టీ, కాఫీ, పాలు, మజ్జిగ అందించడం జరిగింది. వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది దర్శన క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని కంపార్ట్మెంట్ లన పర్యవేక్షి స్తూ శ్రమిస్తున్నారు.

## జిల్లాలో 3.39 కోట్లతో 183 ఆలయాల్లో

# ధూప దీప నైవేద్య పథకం అమలు

**అర్ధగిరి ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక**

**116 ఆలయాల్లో అన్న ప్రసాద వితరణకు ప్రణాళికలు**

**రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



వినాయక సదన్ వసతి సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి



మంత్రి రాం నారాయణరెడ్డికి స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈవోలు

కాణిపాకం, మే 21 ప్రభాతవార్త :
కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో 14.74 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన బ్లాక్ 1, బ్లాక్ 2 వసతి సముదాయాలను గురువారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి పూతలపట్టు,చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం 14.74 కోట్ల రూపాయల వ్యయంతో వినాయక సదన్ లో 83 గదులు, 15 సూట్లు, రెండు కామన్ హాల్లో నిర్మించి నట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో దాతలు, ఆలయ పాలక మండలిల సహకారంతో మ్యాచింగ్ గ్రాంట్ల ద్వారా ఆలయాల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ధూప దీప నైవేద్యం పథకం కింద కనీస వసతులు లేని ఆలయాలకు అర్చకులను నియమించి ప్రతినెల వారికి పదివేల రూపాయల వంతెన వారి ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాలో 183 ఆలయాలకు 3.39 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సిజిఎఫ్ నిధుల ద్వారా 30 ఆలయాల పునర్నిర్మాణానికి 64.33 కోట్ల రూపాయలను తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అభ్యర్థన మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ను టెంపుల్ టూరిజం కింద అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేవాదాయ, పర్యాటక, ఇతర శాఖలు కలిసి జూన్ 15 నాటికి ప్రణాళికలు సిద్ధం చేస్తాయని పేర్కొన్నారు. ఆయుర్వేద, నక్షత్ర వృక్షాలతో ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అలాగే ధార్మిక పరిషత్ ఆమోదం తీసుకొని మొగిలి శ్వర స్వామి ఆలయాన్ని పునర్ నిర్మించడానికి శంకుస్థాపన చేపడతామని మంత్రి తెలిపారు. దీంతోపాటు దాతల సహకారంతో మ్యాచింగ్ గ్రాంట్ల ద్వారా అరగొండ చౌడేశ్వరి అమ్మవారి ఆలయం అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాణిపాకం ఆలయ అభివృద్ధిలో భాగంగా టిటిడి ద్వారా రెండు కళ్యాణ మండపాలు విఐపి గెస్ట్ హౌస్ నిర్మాణ పనులు ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయని, మరో మూడు కోట్లతో పుష్కరిణి మార్పిడి, 16 కోట్లతో బస్టాండ్ నిర్మాణం, నాలుగు కోట్లతో డోనర్ గెస్ట్ హౌస్ లను నిర్మించడానికి మంజూరు ఉత్తర జారీ చేసి జూలైలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురజాల జగన్ మోహన్, కాణిపాకం దేవస్థానం ఛైర్మన్ వి. మణి నాయుడు, ఈవో కే పెంచల కిషోర్, దేవాదాయ శాఖ జె సి చంద్రశేఖర్ ఆజాద్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, దేవదాయ శాఖ కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఈవో సాగర్ బాబు, కర్నూలు డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ లతోపాటు ఆలయ అధికారులుపలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### టిడిపికి పక్కలో

# బల్లెంలా ఆ ఎమ్మెల్యేలు !



ప్రభాతవార్త-తిరుపతి:
ఏరు దాటేవరకు ఓడ మల్లన్న ఏరుదాటాక బోడిమల్లన్న అనే చందంగా కొందరు టిడిపి ఎమ్మెల్యే తీరు మారిందనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న ముగ్గురు టిడిపి దళిత ఎమ్మెల్యేలో ఇద్దరు పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారు. కులం కార్డు చూపుతూ పార్టీకి చెందిన నేతలు ఇతర ఎమ్మెల్యేలపై విమర్శలు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ అధినేతలపై విమర్శలకు దిగారు. ఎస్సీ అయిన తనను పార్టీ అణగదొక్కుతున్నదని ఆరోపించారు. ఒక మహిళ చేసిన లైంగిక ఆరోపణల ఆధారంగా ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తాను ఎన్నికల్లో పెట్టిన డబ్బు తనకు ఇచ్చేస్తే పదవికి రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. వైసిపి ఎమ్మెల్యేగా ఉన్న ఆయన అక్కడ టిక్కెట్టు రాదని తెలియడంతో ఆఖరు నిమిషంలో టిడిపిలో చేరి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచాడు. ఇప్పుడు తన అవినీతి అక్రమాలకు బ్రేకులు పడటంతో అధిష్టానంపై తిరుగుబాటు చేస్తున్నారని పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నారు.ఇదిలా ఉండగా మంగళవారం జి డి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ మీడియాతో మాట్లాడుతూ ఒక వర్గం మీడియా, ఎమ్మెల్యేలపై తీవ్రమైన ఆరోపణలు చేశారు.తన నియోజక వర్గంలో చిన్న అక్రమ రవాణా జరిగినా భూతద్దంలో చూపించే మీడియా చంద్రగిరి, నగరి నియోజక వర్గాలలో జరిగే భారీ దోపిడీని పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే చేసే సంస్థలు ఐదు లక్షలు ఇస్తేనే మంచి ర్యాంకులు వేస్తాయని ఆరోపించారు. పైగా తనకు మంత్రి పదవి రాలేదన్న ఆక్రోశం కూడా ఉందని చెపుతున్నారు. చంద్రబాబు నాయుడు మంత్రి పదవి ఇస్తానని చెప్పి మాట తప్పారని తన సన్నిహితుల వద్ద గోడువెల్లబోసుకున్నట్లు సమాచారం. ఆయన అనుచరులు కొందరు ఎస్ ఆర్ పురం మండలం, ఇతర ప్రాంతాలలో అక్రమంగా మట్టి, గ్రావెల్, ఇసుక, అడవి కట్టెలు తరలించి సొమ్ము చేసుకొంటున్నారని అధిష్టానంకు ఫిర్యాదులు. డబ్బులు ఇస్తేనే చంద్రబాబు టికెట్ ఇచ్చారు, డబ్బులు ఇస్తేనే ఓటు వేశారు, గెలిచాను అందుకే నేను డబ్బులు సంపాదించకపోతే ఎలా అని ఎదురు ప్రశ్నిస్తున్నాడని కొందరు బాహాటంగా వ్యాఖ్యలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం మందలించిందంతో తిరుగుబాటు స్వరం వినిపిస్తున్నారని అంటున్నారు. అయితే చంద్రబాబు తొలుత ఇతనికి మంత్రి పదవి ఇవ్వాలని భావించిన మాట వాస్తవమేనని, సమీకరణాల నేపధ్యంలో ప్రభుత్వ విప్ పదవి ఇచ్చారని తెలిసింది. ఇప్పుడు ఆయన వ్యవహారం చూసి పార్టీ పక్కన పెడుతోందని అంటున్నారు. అయితే అధిష్టానం ఆదేశాలతో గురువారం కొంత మెత్తబడి తన మాటలను కొన్ని పత్రికలు, మీడియా వారు వక్రీకరించారని వివరణ ఇచ్చి చేతులు దులుపుకున్నారు.ఇదిలా ఉండగా పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళి పట్ల కూడా ప్రజలు కార్యకర్తల్లో అసంతృప్తి ఉందన్న వార్తలు వస్తున్నాయి. అధిష్టానం వర్గం ఎస్సీ ఎమ్మెల్యేలను సున్నితంగా దారిలో పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

# సిఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు

**సిఎం పర్యటన స్థలాలను పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీమోహన్, గురజాలలు**



సిఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మే 21 ప్రభాతవార్త:
సిఎం నారా చంద్రబాబునాయుడు పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. యాదమరి మండల యాదమరి సంతగేటు పరిసర ప్రాంతాల్లో శనివారం సిఎం నారా చంద్రబాబునాయుడు పర్యటించనుండటంతో గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీ మోహన్, గురజాల జగన్మోహన్‌నాయుడులు సిఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సిఎం నారా చంద్రబాబునాయుడు యాదమరి పిహెచ్‌సిలో సంజీవని కార్యక్రమం ప్రారంభించడంతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొనను న్నారు. ఈ ప్రాంతాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్‌నాయుడులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ సిఎం పర్యటనపై ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులతో మాట్లాడుతూ ప్రజా వేదిక కార్యక్రమంకు వచ్చే ప్రజలకు మంచినీరు, వైద్యసేవలు అందుబాటులో వుండేలా ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. అలాగే హెలిప్యాడ్, బహిరంగసభ, యాదమరి పిహెచ్‌సి సిఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను త్వరితంగా పూర్తి చేయాలన్నారు. అలాగే బహిరంగసభ, పిహెచ్‌సి, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ హనుమంతరావు, ఆర్‌జిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ గిరి, మలేరియా అధికారి డాక్టర్ నవీన్, స్టేట్ డిఐఎన్‌సి టీమ్, యాదమరి తహసిల్దారు పార్థసారధి, వివిధ శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# తుడా అభివృద్ధి పనులపై సమీక్ష

**దివాకర్ రెడ్డి తుడా చైర్మన్‌గా ఏడాది పూర్తి**



తుడా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన డాలర్స్ దివాకర్ రెడ్డి

5లో

## ఉచిత విద్య పేరుతో

# పేదలకు అవమానాలు

**విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న కార్పొరేట్ స్కూళ్లు**




తిరుపతి విద్య, మే 21 ప్రభాతవార్త
విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించాల్సి ఉంటుంది. అయితే తిరుపతిలోని పలు ప్రముఖ సీబీఎస్ఈ పాఠశాలలు ఈ నిబంధనలను పూర్తిగా అమలు చేయడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సీటు కేటాయించినప్పటికీ అడ్మిషన్ ఇవ్వకుండా సాకులు చెబుతున్నారని పేరెంట్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు లేదు, ఆధార్ కార్డులో తప్పులు ఉన్నాయి, వయస్సు రెండు నెలలు తక్కువ అంటూ తిప్పిస్తున్నారని చెబుతున్నారు. పిల్లలతో కలిసి రోజులు తరబడి పాఠశాలల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధపడుతున్నారు. పేద పిల్లలకు ప్రభుత్వం ఇచ్చిన హక్కును కార్పొరేట్ యాజమాన్యాలు కాలరాస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రముఖ పాఠశాలలపై ఆరోపణలు

తిరుపతిలోని పలువురు కార్పొరేట్, సీబీఎస్ఈ పాఠశాలలు ఉచిత సీట్ల విషయంలో నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా బీజీఎస్ విజ్ఞాతం స్కూల్, స్లేట్ ది స్కూల్, పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్, అకార్డ్ స్కూల్, శశి ఈఎం హై స్కూల్ (సీబీఎస్ఈ), కాండర్ నేషనల్ పబ్లిక్ స్కూల్, భారతీయ విద్యాభవన్ శ్రీ వెంకటేశ్వర విద్యాలయ, శ్లోకా ఎ బిర్లా సీబీఎస్ఈ రెసిడెన్షియల్ అండ్ డే స్కూల్, కేంద్రీయ విద్యాలయ నెం.1 వంటి పాఠశాలల్లో సీట్లు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం అధికారికంగా సీటు కేటాయించినప్పటికీ పాఠశాలలు అడ్మిషన్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. పాఠశాలల తీరుపై ప్రభుత్వం వెంటనే విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులను ఆశ్రయించినా స్పందన రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మా నిబంధనలు మాకు ఉన్నాయి, మేము ఏమీ చేయలేం అంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా హక్కు చట్టం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్లు పెరుగుతున్నాయి.

**ఫీజుల దోపిడీతో కార్పొరేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం**

ఒకవైపు పేదలకు కేటాయించాల్సిన ఉచిత సీట్లను ఇవ్వకుండా తప్పించుకుంటున్న కార్పొరేట్ స్కూళ్లు, మరోవైపు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్ ఫీజు, బస్సు ఫీజు, పుస్తకాలు, యూనిఫాం పేర్లతో భారీ మొత్తాలు తీసుకుంటున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మధ్యతరగతి కుటుంబాలు కూడా పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చి లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పేదలకు ఇవ్వాల్సిన సీట్లను కూడా పరోక్షంగా అమ్ముకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయని సామాజిక సంస్థలు మండిపడుతున్నాయి. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సీటు కూడా పనికిరాదా?, మా పిల్లలకు ఫ్రీ విద్య దొరకదా? అంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రతి జిల్లాలో ప్రత్యేక ఫిర్యాదు కేంద్రాలు ఏర్పాటు చేసి పేదలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

## ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి

వి.కోట, మే 21 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని పలమనేరు శాసనసభ్యులు అమర్ నాథ రెడ్డి తెలిపారు.పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన ప్రమాద భీమా చెక్కులను బాధిత కుటుంబాలకు గురువారం ఆయన అందజేశారు. మండల పరిధిలోని యాలకల్లు పంచాయతీ వైసీ బండపల్లి గ్రామానికి చెందిన రైతు రామేగౌడు విద్యుత్ షాక్ గురై ఆరు నెలల క్రితం మృతి చెందాడు.దీంతో కుప్పం రెస్కో ద్వారా మృతుడి భార్య వెంకటలక్ష్మికి రూ 5 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు.అదేవిధంగా రామనాథపురం గ్రామానికి చెందిన రాజేంద్ర నాయుడు భార్య రమ గతంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందింది.దీంతో బాధిత కుటుంబీకులకు,5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్యకర్తల సంక్షేమం తమ పార్టీకి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ప్రమాదాల్లో నష్టపోయిన కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తూ,వారికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ఈ భీమా సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు.బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్,ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గజేంద్ర,పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, రెస్కో ఎండీ సోమశేఖర్, ఏడి శివకుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు రామచంద్ర నాయుడు,రాంబాబు,ఈశ్వర్ గౌడ్,ధీరజ్,శబరీష్ ,నారాయణ స్వామి, చంద్రశేఖర్ రెడ్డి,హరినాథ్ రెడ్డి, మైనారిటీ నాయకులు రూహుల్లా,అక్మల్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## మృతిచెందిన దళితుల చిత్రపటాలకు ఘన నివాళులు

కుప్పం, మే 21 ప్రభాతవార్త



వైకాపా పాలనలో దాడుల్లో మృతి చెందిన వైజాగ్‌కు చెందిన డాక్టర్ సుధాకర్, హత్యకు గురైన ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్ సుబ్రమణ్యంల చిత్రపటాలకు ప్రభుత్వవిప్,కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం ఘన నివాళులు అర్పించారు. మున్సిపల్ పరిధి పలార్లపల్లిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కడ సభ్యుడు రాజ్‌కుమార్,క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, మాజీ సర్పంచ్ ఎల్లప్ప, నేతలు మురుగేష్, గణపతి, వాసు,ప్రశాంత్, రాజేష్, నాగభూషణం, ప్రతాప్ సింహ తదితరులు పాల్గొన్నారు.

## మృదుస్వభావి పంజం :: ముద్దా, రామిరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, మే 21 ప్రభాతవార్త:



రైల్వేకోడూరు వైసీపీ సీనియర్ నేత మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మృదు స్వభావి అని రైల్వేకోడూరు వైసీపీ నాయకులు ముద్దా బాబుల్ రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డిలు అన్నారు. గురువారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయితీ తూర్పుపల్లిలో పంజ సుకుమార్ రెడ్డి మొదటి సంవత్సరికం ఘనంగా ఆయన తనయుడు పంజం శ్రీవర్ధన్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కే శ్రీనివాసులు, రాజంపేట మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ ఆమె కుమారులు మాజీ స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, విజయ్ రెడ్డి తోపాటు ప్రముఖ పారిశ్రామికవేత్త చియ్యవరం వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైల్వే కోడూరు అత్యంత ముఖ్యమైన రాజకీయ నాయకులలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి అత్యంత విశ్వాస పాత్రులని, అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని పట్టుబట్టి అనంతరాజుపేట పల పరిశోధన కేంద్రాన్ని ప్రస్తుతం ఉద్యాన కళాశాల యూనివర్సిటీగా ఏర్పాటు చేసిన ఘనత పంజం సుకుమార్ రెడ్డికి చెందుతుందని వారు కొనియాడారు. అదేవిధంగా అప్పటి కడప జిల్లాలో అతిపెద్ద పంచాయితీ అనంతరాజుపేట పంచాయతీలో సర్పంచిగా చక్రం తిప్పి అప్పటి జడ్పీ చైర్మన్ తులసి రెడ్డి ఆధ్వర్యంలో అనంతరాజుపేట పంచాయతీని అంచలంచలుగా అభివృద్ధి చేయడంలో పంజం సుకుమార్ రెడ్డికి తిరుగులేదని, అదేవిధంగా కోడూరు పట్టణంలో డాల్ఫిన్ డేల్ పాఠశాలను ఏర్పాటు చేసి నిరుపేదల విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంలో సుకుమార్ రెడ్డి పాత్ర ఎంతో కీలకమని వారు కొనియాడారు . ఆయన అకాల మృతి వైసిపి పార్టీకి తీరని లోటుని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోడూరు కు చెందిన ఉపసర్పంచ్ తోట శివ సాయి, దార్ల చంద్రశేఖర్, యజ్ఞం చంద్రశేఖర్, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, నాయిని హరికృష్ణ రెడ్డి, అనంతరాజుపేట మైనార్టీ నాయకులు షేక్ షఫీ, ప్రసాద్ రెడ్డి, యాదవ సంఘం నాయకులు కౌరడి సిద్దయ్య, ఆనంద్, కోడూరు జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ చంద్ర, మాజీ నీటి సంఘం అధ్యక్షులు పంజం వేణుగోపాల్ రెడ్డి, గురువు రెడ్డి తదితరులతోపాటు వైసీపీకి చెందిన అగ్ర నాయకులు పాల్గొన్నారు.

## కొత్తకోడూరు గంగమ్మ జాతరలో పంతగాని..

రైల్వేకోడూరు రూరల్, మే 21 ప్రభాతవార్త



రైల్వే కోడూరు పట్టణంలోని కొత్త కోడూరులో గురువారం నిర్వహించిన గంగమ్మ జాతరకు ముఖ్యఅతిథిగా రైల్వే కోడూరు టిడిపి యువ నాయకులు రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు కళాశ్రీ పంతగాని నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంతగాని నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ కొత్తకోడూరు స్థాపించినప్పటి నుండి గంగ జాతర నిర్వహణకు పాలక మండలి వారు తనను ఆహ్వానించడం ఎంతో సంతోషకరమని అదే విధంగా రైల్వేకోడూరు నియోజకవర్గా ప్రజలకు చల్లటి అమ్మవారి చూపు ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంతం నందు అమ్మవారి జాతరలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చక్కటి ఏర్పాట్లు చేయడం పట్ల అమ్మవారి ఆలయ కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పాల్గొన్నారు.

## మంగంపేట మిషన్ యజమానులను దొంగలు అనడం సబబు కాదు

### మిషన్ యజమానుల సంఘం నాయకులు మండిపాటు

ఓబులవారిపల్లి 21 మే ప్రభాతవార్త



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట ఏపీఎండిసి గనుల కోసం గనుల అభివృద్ధి కోసం తమ గ్రామాలను ఇంటి స్థలాలను పంట పొలాలను వదులుకొని. జీవనోపాధి కోసం మంగంపేట సంస్థ ఏపీఎండిసి నీ నమ్ముకుని హిటాచి మిషన్లు లారీలు అప్పులు చేసి కొనుగోలు చేసి లోడింగ్ కు సహకరిస్తూ ఉన్నామని అటువంటి వారిని మిషన్ యజమానులను మొన్న జరిగిన చలో ఏపీఎండిసి. కార్యక్రమంలో భాగంగా కొంతమంది మేధావి వర్గం వర్గం మిషన్ యజమానులను దొంగలు అనడం సబబు కాదని మిషన్ యజమానుల సంఘం అసోసియేన్ నాయకులు పలువురు మంగంపేట గ్రామ పెద్దలు ఖండించారు ఇలా మాట్లాడడం ఎంతవరకు కరెక్ట్ అని సర్వం కోల్పోయి ఏపీఎండిసికి మా భూములు ఇల్లు దారా దత్తం చేశామన్నారు కొన్ని కంపెనీలకు సంబంధించి క్రీడల్లో గందరగోళం సృష్టించి పంపిణీ చేస్తున్నారని పలు ఆరోపణలు చేయడం అభ్యంతరం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పలువురు లారీ అసోసియేషన్ నాయకులు మిషన్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్ఎంయుఎచే డిమాండ్స్‌డే కార్యక్రమం

కుప్పం, మే 21 ప్రభాతవార్త



రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కుప్పం ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయుఎ డిపో అధ్యక్షుడు మునెప్ప, కార్యదర్శి జయపాల్ అధ్వర్యంలో డిమాండ్స్‌డేను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీ, ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే స్త్రీశక్తి బస్సుల్లో జీరో టికెట్ విధానం నిలుపుదల చేసి మిగతా ప్రయాణీకులకు టికెట్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీలో రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నారు. పిఆర్‌సి కమిటీని నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఎలు, అరియర్లు, ఎల్ఎన్‌సి వెంటనే ఇవ్వాలన్నారు. రిటైర్ అయిన, చనిపోయిన సిబ్బందికి సెటిల్‌మెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో రహంతుల్లా, కుమార్, మొగిలీశ్వరయ్య, వెంకటయ్య, చంద్ర, రమణ, నోము, రాజు, సుభాన్, బ్రహ్మం, రాజా, నాయక్, రాజు, ఉదయ్‌రాజ్ పాల్గొన్నారు.

## రాజీవ్‌ను విస్మరించిన కాంగ్రెస్

చిత్తూరు, మే 21 ప్రభాతవార్త:



జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని పూర్తిగా విస్మరించింది. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నప్పుడు ఓ వెలుగు వెలిగిన గాంధీ కుటుంబసభ్యులను ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోని నాయకులు, కార్యకర్తలే పట్టించుకోవవడం లేదు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్థంతి గురువారం వున్నప్పటికీ ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు జిల్లా కేంద్రం చిత్తూరులో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ పేరును ప్రస్తావించలేదు. చిత్తూరులో రాజీవ్‌గాంధీ విగ్రహం వున్నప్పటికీ ఏ ఒక్క నాయకుడు ఆ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించలేదు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వెంకటేష్ నియమితులైనప్పటికీ ఆయన పార్టీ కార్యక్రమాలను ఏ మాత్రం చేపట్టడం లేదనే ఆరోపణలు వున్నాయి. అలాగే చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులుగా వున్న టిక్కి రాయల్ అడపా దడపా కాంగ్రెస్ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ గురువారం రాజీవ్‌గాంధీ వర్థంతిని మాత్రం చేయలేదు. ఇకనైనా జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

## ఘనంగా గంగమ్మ తల్లి జాతర

పుల్లంపేట, మే 21 ప్రభాతవార్త :



మండల పరిధిలోని తిప్పాయపల్లె గ్రామంలో గురువారం గంగమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు ఈ జాతరను గత 47 సంవత్సరాల ముందు నిర్వహించారని అప్పటినుండి కొన్ని అనివార్య కారణాలవల్ల నిర్వహించలేదని మళ్లీ ఈ సంవత్సరం జాతర నిర్వహించడం పట్ల చుట్టుపక్కల గ్రామాల్లోనే కాకుండా కడప తిరుపతి అన్నమయ్య జిల్లాల నుంచి తిప్పాయపల్ల గంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు ఈ జాతరకు ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యుడు రామచంద్రారెడ్డి రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరై గంగమ్మ తల్లి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు అనంతరం అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పుల్లంపేట మాజీ సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసలు రెడ్డి, జడ్పిటిసి గీతా రామనాథం, మాదినేని వెంకటరెడ్డి, ఎంపీటీసీ గని, రైల్వే కోడూరు నియోజకవర్గం రివర్స్ వింగ్ అధ్యక్షుడు భోగా పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు

## ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన అసిస్టెంట్ కమిషనర్...

రైల్వే కోడూరు రూరల్, మే 21 ప్రభాతవార్త



రైల్వేకోడూరులోని ఎక్సైజ్‌స్టేషన్లో గురువారం అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేసినట్లు తెలిసింది. అయితే సంబంధిత కార్యాలయం నందు పాత కేసుల గురించి మరియు క్రైముకు సంబంధించిన కేసులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. అదేవిధంగా బెల్ట్ షాపుల కట్టడి తదితర అంశాలపై పలు సూచనలను కడప ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి సూచించినట్లు సంబంధిత ఎక్సైజ్ స్టేషన్ అధికారులు తెలిపారు.

## మూగజీవాలకై నీటి తొట్టెల నిర్మాణం



శాంతిపురం, మే 21 ప్రభాతవార్త

ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో మూగజీవాలకు నీరు అందించుటకు నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు ఎంపిడిఒ ఎపిఆర్ కుమార్ తెలిపారు. గురువారం కడపల్లి, 121 పెద్దూరు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టెలను ఆయన పరిశీలించారు. మండలంలో ఇరవై తొట్టెలు నిర్మించినట్లు తెలిపారు. ఒక్కో తొట్టెను 30వేల అంచనాతో నిర్మించామన్నారు. ఈ తొట్టెల్లో పశువులకు నీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నీటి తొట్టెల నిర్మాణంపై రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపిఒ రెడ్డెమ్మ, టిఎలు ధర్మలింగం, శ్రీనివాసులు, శంకరప్ప పాల్గొన్నారు.

## ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

శాంతిపురం, మే 21 ప్రభాతవార్త

స్థానిక తుమ్మిశి వద్దగల ప్రభుత్వ ఐటిఐ సంస్థలో మొదటి విడత అడ్మిషన్లను అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఆన్‌లైన్‌లో జూన్ 30వతేది వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అలాగే జూలై 2వతేది వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఐటిఐలో నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సుల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## గృహ..జనాభా గణనపై ఎస్పో్వ తనిఖీలు

బైరెడ్డిపల్లి, మే 21 ప్రభాతవార్త



మండలంలో జరుగుతున్న గృహ, జనాభా గణనపై స్పెషలాఫీసర్ లక్ష్మి తనిఖీలు చేశారు. గ్రామాల్లో పొలాల వద్ద ఉన్న ఇళ్లకు సంబంధించి వివరాలు తప్పక నమోదు చేయాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 26 లోపల గృహ,జనగణన చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎఒ ఆనందబాబు, ఆర్ఐ దామోదరాచారి, సర్వేయర్ నరేష్, విఆర్వోలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

బైరెడ్డిపల్లి, మే 21 ప్రభాతవార్త

స్థానిక పిహెచ్‌సి కేంద్రంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో చేపట్టే ప్రథమ చికిత్స, సురక్షిత ప్రాంతాలకు తరలింపు తదితర అంశాలపై వివరించారు. కార్య క్రమంలో పిహెచ్‌సి వైద్యుడు విజయచందర్, పలమనేరు ఫైర్ సిబ్బంది సుమన్, రెడ్డెప్పరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడి పోస్టులకు దరఖాస్తు చేయండి : సిడిపిఓ

పలమనేరు, మే 21 ప్రభాతవార్త:



పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడి పోస్టులకు అర్హులైన వారినుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ ఉమారాణి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె. పెద్దపంజాణి. వి.కోట మండలాలున్నాయి. అంగన్‌వాడి కార్యకర్త, మినీ కార్యకర్త, పోస్టులు, సహాయకురాలి పోస్టులు, సహాయ కార్యకర్తల పోస్టులు మొత్తం 42 ఖాళీలు ఉన్నాయి. నోటిషికేషన్ వెలువడిన తర్వాత 10 రోజుల వరకు ధరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులైన మహిళలు 01.07.26 నాటికి 21 నుండి 35 ఏళ్ళ వయసు, వివాహితులు, స్థానికులు, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అంగన్‌వాడి సహాయకురాలు ఎవరైనా కార్యకర్త పోస్టులకు ధరఖాస్తు చేసుకోవడానికి 45ఏళ్ళ వయోపరిమితి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలు ఉన్న చోట 21ఏళ్ళ ఉన్న వారు లేని ఎడల 18 ఏళ్ళు నిండిన వారు కూడా అర్హులు. నియామకాలు జరిగిన తర్వాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం గౌరవ వేతనం నెలకు అంగన్‌వాడి కార్యకర్తకు రూ.11,500, మినీ కార్యకర్తకు రూ. 7 వేలు, సహాయకురాలికి రూ.7 వేలు వంతున ఉంటుందని సిడిపిఒ తెలిపారు.

## మృతుల కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే

వి.కోట, మే 21 ప్రభాతవార్త:

మండల పరిధిలోని కస్తూరి నగరానికి చెందిన తెలుగుదేశం పార్టీ పంచాయతీ అధ్యక్షులు బాలసుందరం బావ పరంధామయ్య మృతి చెందడంతో మండలం తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి గురువారం ఎమ్మెల్యే అమర నాథ రెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారి కుటుంబీకులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. వీరి వెంట మండల తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతి గంగమ్మ హుండీల లెక్కింపు

కుప్పం, మే 21 ప్రభాతవార్త



కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి జాతర విజయ వంతంగా ముగిసింది. గురువారం ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర బాబు, ఇఒ రమణ, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో అమ్మవారి ఆలయంలో ఉన్న హుండీల లెక్కింపు కార్యక్రమంను చేపట్టారు. రాత్రి 7.30గంటల వరకు హుండీల లెక్కింపు జరగగా అప్పటికే దాదాపు 51లక్షల నగదు, వంద గ్రాములకుపైబడి బంగారం, ఆరువందల గ్రాములకు పైబడి వెండి ఆభరణాలను అమ్మవారికి భక్తులు కానుకల రూపంలో వేసినట్లు గుర్తించామని అధికారులు చెప్పారు. కాగా శుక్రవారం సైతం ఆలయంలో హుండీల లెక్కింపు కొనసాగుతుందని దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

# రక్తపోటు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

రొంపిచెర్ల, మే 21 ప్రభాతవార్త:



రక్తపోటు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ తెలిపారు. డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ తన సిబ్బందితో ప్రపంచ రక్తపోటు వారం సందర్భంగా మండల పరిధిలో వున్న సచివాలయం సిబ్బంది, పోలీసులకు రక్తపోటు పరీక్షలు (బి.పి) చేశారు. అంటువ్యాధులు కానీ జబ్బులలో ముఖ్యంగా బి.పి, షుగర్ వ్యాధి, గుండెపోటు, క్యాన్సర్ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఈ రక్తపోటు వ్యాధి ఎక్కువగా ఉన్నదన్నారు. ఇప్పుడున్న వాతావరణం బట్టి, తీసుకొంటున్న ఆహారం బట్టి, ఎదుర్కొంటున్న అధిక వత్తిడి బట్టి, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలు వలన రక్తపోటు నమోదు అవుతున్నదని అన్నారు. దీని నివారణ కొరకు తొందరగా పరీక్షలు చేసుకోవడం, వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పక వాడుకోవడం, క్రమం తప్పక రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేయడం, నూనె, ఉప్పు వంటి వాటిని చాలా తగ్గించి ఆహారం తీసుకోవడం, మానసికంగా వత్తిడి లేకుండా ధ్యానం చేయడం వంటి వాటితో పాటుగా క్రమంగా వైద్య నిపుణులు సలహాలు, పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అమ్మణ్ణి, సిహెచ్ఓ పంకజ, హెల్త్ సూపర్వైజర్, యంఎల్‌హెచ్‌పి, ఏయన్‌యం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి శాప్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ లీగ్స్ పోటీలు ప్రారంభం

తిరుపతి క్రీడ, మే 21 ప్రభాతవార్త




తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి శాప్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ లీగ్స్ – 2026 పోటీలు ఈ రోజు ఉదయం 8.00 గంటలకు ఎస్.వి. యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలురు మరియు బాలికల అండర్ 16, అండర్ 20 విభాగాల్లో వివిధ అథ్లెటిక్స్ ఈవెంట్లలో పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో క్రీడాకారులు, శిక్షకులు, అధికారులు, సిబ్బంది కలిపి సుమారు 60 మంది పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడంజరిగింది. రాష్ట్ర స్థాయి పోటీల తేదీలు మరియు వేదిక వివరాలు త్వరలో వెల్లడించబడనున్నాయి. ఎంపికైన అథ్లెటిక్స్ క్రీడాకారుల వివరాలు, అండర్ – 20 బాలురు జి. సాయి అభినవ్ రెడ్డి – 100 మీటర్లు పి. మనస్ కుమార్ – 400 మీటర్లు పి. మనస్ కుమార్ – 400 మీటర్లు, ఎల్. లాద్రే హుస్సేన్ – 800 మీటర్లు, బి. రేతీష్ – లాంగ్ జంప్ ని . మల్లికార్జున – హై జంప్ డి. ప్రవీణ్ కుమార్ – జావెలిన్ త్రో 4/100 రిలే జట్టు జి. సాయి అభినవ్ రెడ్డి, పి. చాణిక్య వెంకట్, భాసవరాజులు, హేమ్ సంజయ్, అండర్ – 20 బాలికలు జె . భువనేశ్వరి – 100 మీటర్లు, ఎం. చందు శ్రీ – 400 మీటర్లు, ఈ. షణ్ముఖ ప్రియ – 800 మీటర్లు, బి. భావన – జావెలిన్ త్రో అండర్ – 16 బాలురు, కె. మహేంద్ర – 60 మీటర్లు (1వ స్థానం) ఎన్. ప్రణీత్ – 60 మీటర్లు (2వ స్థానం) శ్రీకుమార్ – 600 మీటర్లు, కె. సాయి – హై జంప్ పి. నేహాల్ వెంకట్ – లాంగ్ జంప్ (1వ స్థానం) కె. సాయి – లాంగ్ జంప్ (2వ స్థానం) అండర్ – 16 బాలికలు, బి. శర్మి – 60 మీటర్లు (1వ స్థానం) జి. మిథున – 60 మీటర్లు (2వ స్థానం) డి. సోనాక్షి – 600 మీటర్లు (1వ స్థానం) ఎన్. సాహితి – 600 మీటర్లు (2వ స్థానం) ఎన్.వి. స్నేహ స్నిగ్ధ – హై జంప్ కె. శివాని – హై జంప్ (2వ స్థానం) కె. శ్రీ చైతన్యం – జావెలిన్ త్రో (1వ స్థానం), టి. నేహా – జావెలిన్ త్రో (2వ స్థానం), బి. శర్మి – లాంగ్ జంప్ (1వ స్థానం) ఎన్.వి. స్నేహ స్నిగ్ధ – లాంగ్ జంప్ (2వ స్థానం) ఈ సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీ ఎన్. శశిధర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభావంతులైన అథ్లెటిక్స్ క్రీడాకారులను గుర్తించి, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడం ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆస్పత్రిలో వ్యర్థాలే మక్కువ...

### సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో ఇది సంగతి

సత్యవేడు, మే 21 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో శానిటైజర్ల వ్యవస్థ దుస్థితికి చేరింది. వివరాలు ఇలా... గురువారం ఆస్పత్రి ఆవరణలో శానిటైజర్ల కార్మికులు పొంతన లేకపోవడంతో ఎక్కడ పడిన చెత్త అక్కడే ఉండిపోవడంతో ఆస్పత్రి దుస్థితి చేరింది. ఆస్పత్రిలో ఉన్న వారు శానిటైజర్లతో సమయపాలానికి పనులు చేయించుకోకపోవడం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. అధికారులు నువ్వు ముందా.. నే ముందా అంటూ కాలయాన చక్రాన్ని చూస్తూ ఇంటి ముఖం పడుతున్నారు. ఆస్పత్రి పర్యవేక్షణ అధికారి నిర్వహణ పూర్తిగా దుస్థితికి చేరడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు చేసేది ఏమీ లేక ఈ దుస్థితిలోనే రక్త పరీక్ష, ఎముకల పరీక్ష, ఓపీ చూసుకుంటూ ఇంటి ముఖం పడుతున్నారు. ఇంకనైనా ఉన్నతాధికారులు ప్రభుత్వాస్పత్రిపై దృశ్య సాధించి ఆస్పత్రి నిర్వహణ పట్ల చర్యలు తీసుకోవాలని పలువురు రోగులు కోరుతున్నారు.

## మిట్టగంగమ్మ ఆలయ నిర్మాణానికి వితరణ

చంద్రగిరి, మే 21 ప్రభాతవార్త:





స్థానిక మిట్టగంగమ్మ ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న గర్భగుడి నిర్మాణానికి గురువారం దాతలు తమవంతు ఆర్థిక విరాళం అందించారు. చంద్రగిరికి చాకలివీధికి చెందిన డి.నాగరత్నం జ్ఞాపకార్థం భార్య డి.మునిలక్ష్మమ్మ, బావమరిది వి.గురునాథం (జిన్నా) 1,00,116/-లు, అదేవిధంగా చంద్రగిరి భారతి నగర్‌కు అమృతవల్లీ నారాయణన్ అల్లుడు ఎల్.హరికృష్ణ, కుమారుడు వి.కె.శ్రీవత్సం, కుటుంబ సభ్యులు రూ.1,00,116/-లు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డికి నగదు రూపంలో అందజేశారు. దాతలకు పూజారి సుబ్రమణ్యం అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## సరైన జీవన శైలితో వ్యాధులు దూరం

పులిచెర్ల, మే 21 ప్రభాతవార్త




ప్రతిరోజు సమతుల ఆహారం తీసుకోవడం, ఆహారంలో అధిక చక్కెర, ఉప్పు, నూనెల వాడకాన్ని నియంత్రించడం, వ్యాయామం చేయడం, కనీసం ఏడు నుంచి తొమ్మిది గంటల పాటు నిద్రపోవడం, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండటం కొరకు ధ్యానం చేయటం లాంటి జీవనశైలితో వ్యాధులు రాకుండా నివారించవచ్చునని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. పులిచెర్ల రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరం నందు ఆయన పాల్గొని రైల్వే సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ అనేది భారతదేశంలో అంటు వ్యాధులు కాని దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక ముఖ్యమైన ఆరోగ్య కార్యక్రమ మన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధుమేహం, రక్తపోటు, నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల నిర్ధారణకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షలలో వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు, సేవలు అందిస్తామన్నారు. ఈ నెల 17వ తేదిన ప్రపంచ రక్తపోటు దినోత్సవంను పురస్కరించుకొని 24వ తేది వరకు పోలీసు శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, రైల్వే ఉద్యోగుల కొరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి త్వరితగతిన వారిలో వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ అనూప్ కుమార్ మెహత, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, పర్యవేక్షకులు పురుషోత్తం, ఆరోగ్య కార్యకర్త రాణి, ఆశా కార్యకర్తలు సుగుణ, శివరాణి, రైల్వే ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఆంగ్ల అధ్యాపకురాలు హన్నాకు డాక్టరేట్

సత్యవేడు, మే 21 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలుగా పని చేస్తున్న హన్నాకు డాక్టరేట్ డిగ్రీ పొందారు. ఆంగ్లంలో స్కేప్‌గోట్‌పై పరిశోధన చేసినందుకు హన్నాకు డాక్టరేట్ వచ్చింది. ఎస్వీయూ ఆంగ్ల విభాగ రిటైర్డ్ ప్రొఫెసర్ పి.కుసుమ హరినాథ్ పర్యవేక్షణలో హన్నా స్కేప్‌గోట్ యాన్ ఆర్కిటైపల్ పోర్ట్రేయల్ ఆఫ్ ప్రోటాగనిస్ట్స్ ఇన్ వికాస్ స్వరూప్స్ క్యూ అండ్ ఏ.విక్రమ్, ఏ.చంద్రాస్, శ్రీనగర్ కాన్పిరసీ అఖిల్, శర్మాస్, ఫ్యామిలీ లైఫ్, కిరణ్ దేశాయిస్ ది ఇన్హెరిటెన్స్ ఆఫ్ లాస్ అండ్ అరవింద్అడిగాస్ ది వైట్ టైగర్, ఏ నవెల్ అనే అంశంపై ఆమె పరిశోధన చేసి నివేదికను సమర్పించారు. ఈ నేపథ్యంలో పరిశోధన పత్రాలు ఆధారంగా హన్నా డాక్టర్ డిగ్రీ పొందినట్లు తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ఆంగ్ల విభాగానికి చెందిన విభాగపతులు పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన ఆంగ్ల అధ్యాపకురాలు హన్నాను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

## దళితుల హక్కుల పరిరక్షణకు టీడీపీ శాంతియుత నిరసన

నాగలాపురం, మే 21 ప్రభాతవార్త:



నాగలాపురం మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వ నాయకులు తరపున నిరసన కార్యక్రమం నిర్వహించారు. గత ఐదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో దళితులు తీవ్ర అణచివేతలు, వేధింపులు ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా ప్రస్తుత ప్రభుత్వం ఎల్లప్పుడూ దళిత సోదర సోదరీమణులకు అండగా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఆదేశాల మరకు కార్యక్రమం ప్రారంభంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దళితుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాగలాపురం మండల అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి, రాష్ట్ర మొదలయార్ సంఘం డైరెక్టర్ నమఃశివాయం, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జాన్సన్, నెల్సన్ మండేలా, శ్రీనివాసయాదవ్, ఎం.డి.కుమార్, పార్థిబన్, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నరేంద్రరెడ్డి, పురుషోత్తం, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హంస వాహనంపై శ్రీ కామాక్షిదేవి

పుత్తూరు రూరల్, మే 21 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామివారు, అమ్మవారు, హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. అలాగే సాయంత్రం కూడా అభిషేకాలు చేశారు. రాత్రి విశేష పుష్పాలంకరణ విద్యుత్ దీపాలంకరణతో స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## స్విమ్స్‌కు రూ.2,00,000 విరాళం

తిరుపతి హెల్త్, మే 21, ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రికి స్విమ్స్ శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి తిరుపతి నగరానికి చెందిన యం. కిషోర్ కుమార్ లలిత్ ఇన్నోవేషన్ ఫుడ్ టెక్నాలజీ ప్రై లిమిటెడ్ అధినేత కోరిక మేరకు స్విమ్స్ హాస్పిటల్ పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణలోనికి తీసుకొని విరాళం అందించినట్టు తెలిపారు. దాత తరపున తిరుపతి వాస్తవ్యులు వై.రాఘవేంద్ర చేతుల మీదుగా 2,00,000 విరాళాన్ని మూడు చెక్కుల రూపంలో 21వ తేది బుధవారం ఉదయం 11 గంటలకు స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా ఆర్.వి.కుమార్‌కి అందజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ విరాళ దాత లలిత్ ఇన్నోవేషన్ ఫుడ్ టెక్నాలజీ ప్రై. లిమిటెడ్. అధినేత యం. కిషోర్ కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, ఇచ్చిన విరాళాన్ని పేద రోగుల వైద్య సేవలకు ఉపయోగిస్తామని తెలియజేశారు. దయచేసి పత్రికల వారు ఇతర దాతలను ప్రోత్సాహించడానికి తమ ప్రధాన సంచికలో ప్రచురించాల్సిందిగా కోరారు.

## జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నింద్ర,మే 21 ప్రభాతవార్త :



మండలంలోని కచ్చరవేడు గ్రామంలో గురువారం గంగమ్మ జాతర మహోత్సవంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ ఆశీర్వాదం ప్రజలందరికి కలిగి సుఖసంతోషంగా వుండాలని ఆకాంక్షించినారు. ఈ కార్యక్రమంలో యంపిపి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు పేరం వెంకటేశ్వరరావు, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చేర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి,నాయకులు దొరస్వామినాయుడు, రవినాయుడు, మురళీ నాయుడు,నాగభూషణంరాజు,జగన్,బాబుయాదవ్,రమేష్,శేఖర్,చిన్న,దేవనేషన్,తదితరులుపాల్గొన్నారు.

## భాగవత మహాపురాణంపై వారాంత ప్రవచనాలు

### అన్నమాచార్య కళామందిరంలో మే 22 నుంచి ప్రారంభం

తిరుపతి విద్య. మే 21 ప్రభాత వార్త



తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళామం దిరం లో భాగవత మహాపురాణంపై ఆధ్యా త్మిక ప్రవచనాల శ్రేణి ఘనంగా నిర్వ హించనున్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆగమ విభాగ ఆచా ర్యులు, ప్రముఖ పండితులు ప్రొఫెసర్ వేదాంతం శ్రీ విష్ణు భట్టాచార్యులు ఈ ప్రవచనాలను అందించనున్నారు.ఈ నెల 22వ తేదీ శుక్రవారం నుంచి 28వ తేదీ గురువారం వరకు ఏడు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుంది. భాగవత మహాపురా ణంలోని భక్తి, ధర్మం, ఆధ్యాత్మికత, శ్రీకృష్ణ తత్త్వం, మానవ జీవన విలు వలు వంటి అనేక అంశా లపై విశ్లేషణా త్మకంగా ప్రవచనాలు సాగనున్నాయి. భాగవత పురాణం భారతీయ సనాతన ధర్మ సంప్రదాయం లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన మహాగ్రంథంగా భావించబడుతుంది. భక్తి మార్గాన్ని ప్రజల్లో పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చింతనకు దారి చూపే ఈ ప్రవచనాలు భక్తులకు విశేష ఆత్మీయ అనుభూతిని కలిగిస్తాయని నిర్వాహకులు తెలిపారు.ఆధ్యాత్మిక చైతన్యం, సంస్కృతి పరిరక్షణ, ధార్మిక విలువల ప్రచారమే లక్ష్యంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ తరచూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.భక్తులు, విద్యార్థులు, వేద పండితులు, ఆధ్యాత్మికాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు

## నెక్స్ట్ ఫెస్టివల్ సినిమా ను విజయవంతం చేయండి...

– హీరో లోకేష్ అంజేరి...

తిరుపతి హెల్త్, మే 21, ప్రభాతవార్త




సినిమా రంగం భాగ్యనగరాలు కె పరిమితం అయిందని. అలాంటిది తిరుపతిలో కూడా ప్రారంభించాలని ఉద్దేశంతో తిరుపతి నివాసిగా తిరుపతి పరిసర ప్రాంతంలోనే మా మూడవ సినిమా నెక్స్ట్ ఫెస్టివల్ సినిమాను తీశామని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ సినిమాలో పల్లెటూరి వాతావరణం. గ్రామాలలో పెద్దలు పిల్లలు చేసే తప్పులకు ఎలా కట్టుబాట్లు ఉంటాయో ఈ సినిమాలో తెలియజేశామని, ఈ సినిమా కుటుంబ సమేతంగా పిల్లలు పెద్దలు అందరూ చూసి ఆనందించే విధంగా ఉంటుందని అన్నారు.. ఈ సినిమాని వరలక్ష్మి ప్రొడక్షన్లో తీసామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ వంశి, హీరోయిన్ అమృత బిందు, డైరెక్టర్ ఆచారి శివ, అతిధి పాత్రదారి పూజారి కళ్యాణి, తిరుపతి బీసీ నాయకులు జగన్నాథం పాల్గొన్నారు.

## డా. వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి క్రీడ, మే 21, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కడపలో నిర్వహిస్తున్న డా. వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో 2026–27 విద్యా సంవత్సరానికి 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ తెలిపారు. 4వ నుండి 6వ తరగతుల ప్రవేశాల కోసం జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ఎంపిక పరీక్షలు రెండు దశల్లో నిర్వహించబడతాయని తెలిపారు. 7 నుండి 9వ తరగతుల వరకు రాష్ట్ర స్థాయిలో మాత్రమే ఎంపిక పరీక్షలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. ఈ క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడల్లో నైపుణ్య శిక్షణతో పాటు ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించబడుతుంది. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల 2వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. పూర్తి సమాచారం కోసం హెచ్‌టిటిపిఎస్://ఏపిస్పోర్ట్స్ స్కూల్.ఏపి.జీవోవి.ఇన్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు అని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి తహసీల్దార్ వాసుదేవ కుమార్

యర్రావారిపాలెం, మే 21, ప్రభాతవార్త



భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని యర్రావారి పాలెం మండల తహసీల్దార్ వాసుదేవ కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కమలయ్యగారి పల్లి గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి నేరుగా సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమం ద్వారా గ్రామస్థుల సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యంగా భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 8 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. వాటిలో నాలుగు పట్టాదారు పాస్ పుస్తకాల మ్యూటేషన్‌కు సంబంధించినవిగా ఉండగా, ఒక అర్జీ దారి సమస్యపై ఉందన్నారు. మరో మూడు అర్జీలు ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైన వివరాలను తొలగించాలని రైతులు వినతిపత్రాలు సమర్పించినట్లు వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తహసీల్దార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివాకర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కూటమి నాయకులు తప్పులను ఎత్తి చూపిస్తే పబ్లిసిటీగా అనిపిస్తుందా..!

## వైయస్సార్సీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అజయ్

తిరుపతి హెల్త్, మే 21, ప్రభాతవార్త




కూటమి నాయకులు చేసిన తప్పులను ఎత్తి చూపిస్తే, మీకు పబ్లిసిటీగా అనిపిస్తుందా మీరు మాట్లాడే మాటలు, వ్యవహరిస్తున్న తీరును ప్రజా క్షేత్రంలో ఎండగడతాం వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అజయ్ కుమార్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీరు సద్గురు సాయిబాబా శిష్యులు లాగా, రామకృష్ణ పరమహంస భక్తులు లాగా, వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. వైసిపి కార్పొరేటర్ల క్యాంపులోకి తాగి వచ్చి వాళ్ల మీద దౌర్జన్యం చేసి,కిడ్నాప్ కు ప్రయత్నించడాన్ని రౌడీయిజం అంటారని, తొలగించిన బ్యానర్ సాకుగా చూపి కరుణాకర్ రెడ్డి ఇంటి వద్ద రౌడీ మూకలు అల్లర్లు చేయడాన్ని రౌడీయిజం అంటారని, శాంతియుతంగా వైసిపి ధర్నా నిర్వహిస్తున్న మహిళలపై, పోటిగా ధర్నా నిర్వహించడాన్ని ఏమంటారో మీరే చెప్పాలని అన్నారు. మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని కొండ ఎక్కవద్దని అడ్డుకొని నిరసన తెలిపితే, మీ పార్టీకి చెందిన రౌడీ మూకలు మహిళలని చూడకుండా తలలు పగలగొట్టారని, దీనిని కూడా రౌడీయిజం అంటారని వాపోయారు. తులసమ్మ స్థలంలోకి మేము కబ్జాకుపోలేదు జర్నలిస్టుల కోసం అక్కడికి మా వాళ్ళు వెళ్లారు అనడం, ఇక్కడ ఏదో దాగి ఉందని అర్థం కాదా? అని ప్రశ్నించారు. తిరుపతి ఎలక్షన్లలో అభినయ రెడ్డి ఓడిపోయినంత మాత్రాన రాజకీయాలు మానుకోవాలా? అని ప్రశ్నించారు. గతంలో చాలామంది ఓడి గెలిచిన వారే అని మీకు తెలియదా? శాప్ చైర్మన్ రవి నాయుడు పిల్లలకు స్పోర్ట్స్ నిర్వహించడం ఆనవాయితీ అని, ఇతని ప్రాబల్యం పెంచుకోవడం కోసం ఎమ్మెల్యేలు, మంత్రులతో ఆటలు నిర్వహించారన్నారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు యాదవ్ మాట్లాడుతూ శాప్ చైర్మన్ రవి నాయుడు తిరుపతి రాజకీయాలలో వేలు పెట్టినప్పటి నుంచి మీ పార్టీలోనే గ్రూపు రాజకీయాలు ఏర్పడ్డాయని, తను చంద్రగిరి రాజకీయాలు చూసుకోవాలని సూచించారు. భూమన కరుణాకర్ రెడ్డి,అభినయ్ రెడ్డి పైన వ్యంగ్యంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని,పద్ధతి మార్చుకోవాలని కోరారు. ఎర్ర మిట్ట భూ బాధితురాలు తులసమ్మకు మీ పార్టీ నాయకురాలు సుగుణమ్మ, ఆర్సి మునికృష్ణ వెళ్లి సంఘీభావం తెలపలేదా? అన్నారు. మీరు మాట్లాడిన దానికి మేము సమాధానం చెబితే అది నేరమా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శి మల్లం రవి, తిరుపతి ప్రచార అధ్యక్షులు రమణారెడ్డి, బీసీ సెల్ క్లస్టర్ అధ్యక్షులు నాగేంద్ర పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు కార్మికుల నిరసన



వెంకటగిరి, మే 21 ప్రభాతవార్త: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వెంకటగిరి డిపో నందు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై డిమాండ్ డే సందర్భంగా రెండో రోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డిపో ప్రెసిడెంట్ వి.పూర్ణేశ్వరరావు ఆధ్వర్యంలో బ్యాడ్జీలు ధరించి, నిరసన కార్యక్రమం చేశారు. టీ విరామ సమయంలో ఉదయం 11 గంటలకు గేట్ మీటింగ్ ధర్నా నిర్వహించారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.స్త్రీ శక్తి బస్సుల్లో సున్నా టికెట్ విధానాన్ని నిలిపివేసి మిగతా ప్రయాణికులకు సాధారణ టికెట్లు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేతన సవరణ కమిటీని నియమించి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డిఎ బకాయిలు, లీవ్ ఎన్కాష్మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి వెంకటగిరి డిపోవర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్, వైస్ ప్రెసిడెంట్ కె.ఆర్.బాబు, డిపో సెక్రటరీ కె.రత్నం కమిటి మెంబర్స్ కె.నాగరాజ, పి.విజయకుమార్, డి.పి.స్వామి, బి.శ్రీహరి, కె.సురేంద్ర, ఏం.చంద్రా, పి.వెంకటేశ్వర్లు, సి.హెచ్.వెంకటేశ్వర్లు, గ్యారేజ్ కార్యదర్శి కె.లక్ష్మణరావు, గ్యారేజీ కమిటి మెంబెర్స్ ఎన్.కృష్ణ, శివకుమార్, మహిళా ఉద్యోగులు సుల్తానా, రామక్క ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## కోటి 36లక్షలతో జల హారతి జల ధార పనులు



బాలాయపల్లి, మే 21 ప్రభాతవార్త: మండలంలో కోటి 36 లక్షల రూపాయలతో జల హారతి జల ధార పనులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దాసరి నారాయణ తెలిపారు. మండలంలోని చుట్టి గ్రామంలో ఎనిమిది లక్షల రూపాయలతో జరుగుతున్న ఫిష్ పాండ్ పనులను ఆయన పరిశీలించారు. మండలంలో జల హారతి జలధార పథకం ద్వారా కోటి 36 లక్షల రూపాయలతో 22 పనులు జరుగుతున్నట్లు వివరించారు. జల హారతి జల ధార పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. జూలై 10వ తేదీ లోపల పనులన్నీ పూర్తి చేయాలి అని తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండేందుకు చెట్ల తొలగింపు, పొడిక తీత పనులను కూడా పూర్తి చేయాలి అని సూచించారు. ఆయన వెంట ఉపాధి హామీ పథకం టిఏలు, ఎస్ఏలు ఉన్నారు.

## ఆర్టీసీ కార్మికుల ధర్నా



సూళ్లూరుపేట, మే 21 ప్రభాతవార్త: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుపతి జిల్లా ఎన్ఎంయుఏ జిల్లా కార్యదర్శి బిఎస్ బాబు మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ప్రభుత్వం ద్వారాకొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. శ్రీ శక్తి బస్సుల్లో జీరో టిక్కెట్ ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి మిగతా ప్రయాణికులకు టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీలో పాత వైద్య విధానాన్ని కార్మికులకు అమలు చేయాలని, కొత్త సిబ్బందిని రెగ్యులర్ ప్రాతిపదికన నిర్మించాలని కోరారు. ప్రయాణికులు సరిపడా నూతన బస్సులను కొనుగోలు చేసి పిఆర్సి కమిటీని నిర్మించి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని తెలిపారు. సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, మదనపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడపాలని బిఎస్ బాబు ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశారు. డిపో కార్యదర్శి ఎం శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలోఎన్ ఎం.యు.ఏ నాయకులు కే కరుణాకర్ రెడ్డి,వెంకటేశ్వర్లు, భాస్కర్, శంకరయ్య, చెల్లయ్య, ఆనందం, ఎమ్మెస్ మన్యం, జగదీష్, పిడి రెడ్డి, కాలేష తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య మహిళలకు...సముద్రపు నాచుపై శిక్షణ



వాకాడు, మే 21 ప్రభాతవార్త : మండల కేంద్రమైన వాకాడులో జిసిఎఫ్, ఈసిఆర్ ఐసిసి ప్రాజెక్ట్ కింద మత్స్యశాఖ సహకారంతో రీడ్స్ ఎన్‌జిఒ సంస్థ ఆధ్వర్యంలో మత్స్య మహిళలకు సముద్రపు నాచు సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీఎఫ్, ఈసీఆర్ఐసీసీ జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా కలెక్టర్ జిల్లా అధికారుల నిరంతర మద్దతు, నిశిత పర్యవేక్షణతో ఈ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నవారు తాము పొందిన జ్ఞానాన్ని ముందుకు తీసుకువెళ్లి, దానిని అర్థవంతమైన ఫలితాలుగా మార్చడానికి నిరంతర కృషి చేస్తారని తాము విశ్వసిస్తున్నామన్నారు. వారి నిబద్ధత జిల్లా సామర్థ్యాన్ని పెంపొందించి, సముద్రపు నాచు సాగులో అగ్రగామిగా నిలపడానికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమం కేవలం శిక్షణకు మాత్రమే పరిమితం కాదు అని, సమాజాలను శక్తివంతం చేయడం, తీరప్రాంత వనరుల అపారమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడం కూడా దీని లక్ష్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత సమాజాలలో సుస్థిరమైన వాతావరణ మార్పులను తట్టుకోగల జీవనోపాధులను ప్రోత్సహించడంలో ఈ ప్రయత్నం ఒక ముఖ్యమైన ముందడుగు అన్నారు. గ్రీన్ క్లైమేట్ ఫండ్, భారతదేశ తీరప్రాంత సమాజాల వాతావరణ స్థితిస్థాపకతను పెంపొందించడం (జిసిఎఫ్, ఈసిఆర్ ఐసిసి, ఆంధ్రప్రదేశ్) చొరవలో భాగంగా తిరుపతి జిల్లాలోని వాకాడు మండలంలోని వాకాడు గ్రామంలో సముద్రపు నాచు సాగుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో సముద్రపు నాచు విలువ గొలుసుపై 1500 మంది పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యంతో, సెర్ప్ మద్దతుతో, మత్స్యశాఖ సహకారంతో రీడ్స్ ఎసిజిఒ సంస్థ ఈ శిక్షణను నిర్వహించిందన్నారు. సముద్రపు నాచు సాగును ఒక సుస్థిర జీవనోపాధిగా చేపట్టడానికి అవసరమైన జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలతో తీరప్రాంత మహిళలను సన్నద్ధం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్వయం సహాయక బృందాల నుండి 50 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. వారు సముద్రపు నాచు సాగు యొక్క ప్రయోజనాలు, పద్ధతులు, ఆర్థిక సామర్థ్యంపై అవగాహన పొందారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సాంకేతిక నిపుణుడు నాయకత్వం వహించారని పేర్కొన్నారు.డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్‌కు చెందిన సాంకేతిక నిపుణుడు మురళీ కృష్ణ, సముద్రపు పాచి తెప్పల తయారీ, కావలసిన సామగ్రి, వాటి నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకాడుకు చెందిన ఏఐఎఫ్ రఘు, ఎస్ఈఆర్పీకి చెందిన ఏపీఎం పోలమ్మ, దుగరాజపట్నంకు చెందిన మత్స్య సహాయకుడు శ్రీనివాస్, జీసీఎఫ్ ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్ట్‌కు చెందిన డాక్టర్ ఎన్. జస్వంత్, రీడ్స్ ఎన్జీఓ ప్రతినిధులు కట్టా వందనం,బి. దీప్తి, హీఫర్ ఇంటర్నేషనల్‌కు చెందిన డాక్టర్ శ్యామ్, ఎస్ఆర్యు డీఎస్ ఎన్జీఓ కార్యదర్శి టి. శ్రీలత, సాగరమిత్ర, వీఎఫ్ఏ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## భద్రతపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్సై



చిట్టమూరు, మే 21 ప్రభాతవార్త: మహిళలు, విద్యార్థులు తమ భద్రతపై అవగాహన కలిగి ఉండాలని చిట్టమూరు ఎస్సై నాగరాజు సూచించారు. గురువారం చిట్టమూరు మండల కూడలి ప్రాంతమైన కొత్తగుంట గ్రామంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, ఫోన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు స్వీయరక్షణ పద్ధతులను నేర్చుకోవడం ద్వారా తమ భద్రతను పెంపొందించుకోవచ్చని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజుతో పాటు సిబ్బంది ఉన్నారు.

## చీమలపాడులో గ్రామ సభ



వాకాడు, మే 21 ప్రభాతవార్త: ప్రజల రెవెన్యూ సమస్యలు పరిష్కార కోసం ప్రభుత్వం గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందని తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. గురువారం వాకాడు మండలం చీమలపాడు గ్రామంలోని తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో గ్రామసభ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభలో అర్జీలను తీసుకొని సత్వరమే పరిష్కరిస్తామని తహసిల్దార్ అన్నారు. భూ సమస్యలు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ నరేష్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, మండల సర్వేయర్ గోపి, విఆర్వోలు, సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రేపే ప్రజా దర్బార్

పెళ్లకూరు, మే 21 ప్రభాతవార్త: పెళ్లకూరులో స్థానికంగా ఉన్న ఎంపీడీవో కార్యాలయం నందు రేపు శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు నెలవల విజయ శ్రీ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించబడునని మండల తెదేపా నాయకులు వేరువేరు ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొంటారని అలాగే మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొంటారని మండల ప్రజలు ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోగలరని తెలియజేశారు.

## శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

సూళ్లూరుపేట, మే 21 ప్రభాతవార్త: సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్థానిక సీఐ ఎం మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహిళలు శక్తి యాప్‌ను తమ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకుంటే దాని ద్వారా తక్షణ సమాచారాన్ని పోలీసులకు చేరవేసేందుకు వీలుంటుందని అన్నారు. దీంతో పది నిమిషాల్లో మహిళలకు అందుబాటులోకి పోలీసులు వచ్చి రక్షణ కల్పించే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. సూళ్లూరుపేట ప్రాంతంలో అపాచీ, శ్రీ సిటీ సెజ్‌లు ఉండడంతో అక్కడి కంపెనీలలో మహిళలు రాత్రి వేళల్లో విధి నిర్వహణకు వెళుతూ ఉన్నారని ఆయన చెప్పారు. సంబంధిత కంపెనీ యాజమాన్యాల వారు రాత్రివేళలో మహిళలకు సురక్షితమైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.సూళ్లూరుపేట ప్రాంతంలో నిరంతర పెట్రోలింగ్, సీసీ కెమెరాలతో నిరంతర నిఘాంటుందని ఆయన తెలిపారు. అత్యవసర సమయాల్లో పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

## సమస్యలు పరిష్కారం కోసమే...ఒక మాసం ఒక గ్రామం



వెంకటగిరి, మే 21 ప్రభాతవార్త : గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారం కోసమే ఒక మాసం ఒక గ్రామం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ పి శిరీష తెలిపారు. అన్ని సమస్యలు పరిష్కారణ లక్ష్యంగా ఈ కార్యక్రమంను రూపొందించడం జరిగింది అని చెప్పారు. ఒక మాసం ఒక గ్రామం నాలుగు విడతలు సందర్శించడం కార్యక్రమం సిద్ధవరం గ్రామం నందు నిర్వహించడం జరిగినది. గ్రామంలోని పలు సమస్యలను ఫిర్యాదు రూపంలో తాసిల్దార్ కు అందజేశారు. సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 3 విడత మండల స్థాయి అధికారులు అందరూ సిద్ధవరం గ్రామంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి,ఆర్ఐ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్బిఎంపై నేటి నుండి శిక్షణ

బాలాయపల్లి, మే 21 ప్రభాతవార్త : ఎస్‌బిఎంజి ఆక్టివేట్ స్పై ఈ నెల 22, 23వ తేదీల్లో, 26వ తేదీ స్త్రీశక్తి భవనంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు, మండల ఇంజనీరింగ్ సిబ్బందికి శిక్షణ జరుగుతుందని ఎంపీడీవో దాసరి నారాయణ తెలిపారు. శిక్షణకు పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తప్పక హాజరు కావాలని కోరారు.

## ఓ మంచి రాజకీయ నాయకుని కోల్పోయాం

**-శాంతారామ్ జె.పవార్ వర్ధంతిలో ప్రముఖుల నివాళ్ళులు**



శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓ మంచి రాజకీయ నాయకుని కోల్పోయామని పలువురు వక్తలు అన్నారు. గురువారం మున్సిపల్, దేవస్థానం మాజీ ఛైర్మెన్ శాంతారాం జె.పవార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శాంతారామ్ రావు జె.పవార్ రాజకీయాల్లో రాజీ లేని స్వచ్ఛమైన పరిపాలను ప్రజలకు అందించిన వ్యక్తి అని అన్నారు. అవినీతి, ఆరోపణలకు అతీతంగా ప్రజలకు పరిపాలనను అందించారన్నారు. అభివృద్ధియే అజెండాగా రెండుసార్లు మున్సిపల్ ఛైర్మెన్‌గా రెండు సార్లు శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం ఛైర్మెన్‌గా శాంతారాం రావు జె.వాపర్ పరిపాలించారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాజకీయంగా వ్యాపార పరంగా,స్నేహశీలిగా ప్రత్యేక శైలి కల్గిన వ్యక్తి శాంతారం జె.పవార్ అన్నారు. ఆయన సేవా భావాన్ని నేడు వారి కుటుంబ సభ్యులు ఎన్నో సంస్థలను ఏర్పాటు చేయటమే కాకుండా, ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన కుమార్తె డాక్టర్ అర్చన ఎస్.పవార్, పవిఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రావు వి.పవార్, డైరెక్టర్లు ముకుందరావు,జె.పవార్, పరమేశ్వరరావు వి.పవార్, జనార్ధన్ రావు జె.పవార్, రైతు సేవా సమితి నాయకుడు మోహన్‌రావు, పడోల్కర్ మహేశ్వరరావు, సిద్ధార్థ జె. పవార్, హెచ్ బాబు, నారాయణ,ప్రసన్న, దిస్కూల్ హెడ్‌మాస్టర్ విశాలి, ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

## దళితుల్ని ఓటు బ్యాంకుగానే చూసిన వైకాపా

**- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ - ప్రశ్నిస్తే కేసులు..దాడులు చేశారు..**

**-దళితుల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే !!**



కుప్పం, మే 21 ప్రభాతవార్త: ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో దళితుల్ని వైకాపా శ్రేణులు కేవలం ఓటు బ్యాంకు గానే చూశాయని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధి పలార్లపల్లి ఎస్సీ కాలనీలో డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రమణ్యం చిత్రపటాలకు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ సభ్యుడు రాజ్‌కుమార్,క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, మాజీ సర్పంచ్ ఎల్లప్ప తదితరులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏరా ్పటుచేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడారు. వైకాపా పాలనలో ప్రశ్నిస్తే దాడులు, కేసులతో నడిచిందన్నారు. ఇలాంటి అరాచకాలు చేసిన వైకాపాను 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారని పేర్కొన్నారు. 27వేల కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వైకాపా పాలనలో దారి మళ్లించారన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధిని అమలు చేయలేదన్నారు. కోవిడ్ సమయంలో మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్‌ను హత్య చేశారన్నారు. వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన సంఘటనలు వైకాపా పాలనలో చోటు చేసుకున్నాయన్నారు. వైకాపా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దళిత యువకుడికి శిరోముండనం చేయించారన్నారు. వైకాపా పాలనలో 56816మంది దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయన్నారు. సామాజిక వర్గాలకు దామాషా ప్రజలకు అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో సిఎం చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. దళితవాడల్లో అవసరమైన వసతులు కల్పిస్తున్నారన్నారు. పి4బంగారు కుటుంబాల్లో 8వేల కుటుంబాల్లో యాభైశాతం దళిత కుటుంబాలు ఉన్నారన్నారు. దళితుల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట వేసింది తెదేపాయేనన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలుగా చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. సమావేశంలో నేతలు మురుగేష్, గణపతి, వాసు,ప్రశాంత్, రాజేష్, నాగభూషణం, ప్రతాప్ సింహ తదితరులు పాల్గొన్నారు

## సిఎం పర్యటన పురస్కరించుకుని అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజనింగ్

**- పర్యటన ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ తుషార్ డూడి, జెసి రాజేంద్రన్**




చిత్తూరు, మే 21 ప్రభాతవార్త: యాదమరిలో శనివారం సిఎం నారా చంద్రబాబునాయుడు పర్యటించే ప్రాంతాల్లో ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజనింగ్(ఎఎస్ఎల్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు పాల్గొని సిఎం పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్ ప్రాంతం, సభా ప్రాంగణం, హెల్త్ కేర్ యూనిట్ ప్రదేశాలు, ప్రజల పార్కింగ్ ప్రాంతాలు, వివిపి పార్కింగ్ ప్రాంతాలు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, అగ్నిమాపక చర్యలు, బారికేడింగ్, వైద్య సేవల సమకూర్పు, రూట్ మ్యాప్ లభ్యత, ట్రాఫిక్ నియంత్రణ, జనసామూహిక నియంత్రణ చర్యలు, ప్రజల వాహనాల పార్కింగ్, వివిపి వాహనాల పార్కింగ్ ప్రదేశాల ఏర్పాట్లపై ఎస్పీ తుషార్ డూడి పోలీసులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. సిఎం ప్రారంభించనున్న సంజీవని ప్రాజెక్ట్ ఏర్పాటు చేసిన యాదమరి పిహెచ్‌సి కేంద్రం, సభా ప్రాంగణం ప్రాంతాలను ప్రత్యేక భద్రతా ప్రాంతాలుగా గుర్తించి ఎస్పీ తుషార్ డూడి సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసులు ప్రతి స్థాయిలో సమన్వయంతో విధులు నిర్వహిస్తూ అన్ని విభాగాలతో సమర్థవంతమైన ప్రణాళికను అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఫైర్ సర్వీసులు, ఆరోగ్య సేవలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పోలీసు బందోబస్తు, డ్రోన్ మానిటరింగ్, వివిపి మూమెంట్స్, ప్రజల రాకపోకలు, పార్కింగ్ నిర్వహణ అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ డాక్టర్ తరుణ్ పహ్వా, ఏఆర్ ఎఎస్పీ దేవదాస్, చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, యాదమరి తహసిల్దారు పార్థసారథి, ఎస్ఐ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువకుడుపై ఫోక్సో కేసు

బాలాయపల్లి, మే 21 ప్రభాతవార్త: మండలంలోని అక్కసముద్రం గ్రామానికి చెందిన మైనర్ గిరిజన బాలికను శ్రీకాళహస్తి చెందిన ఒక యువకుడు ప్రేమ పేరుతో కిడ్నాప్ చేసిన యువకుడు పై పోక్సో కేసు పెట్టినట్లు ఎస్సై కామినేని గోపి తెలిపారు. బాలిక యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై ప్రేమించుకున్నారు. బాలికల యువకుడు కడప జిల్లా రైల్వే కోడూరు తీసుకెళ్లారు. పోలీసులు యువకుడిని తీసుకొచ్చి పోక్సో కేసు పెట్టారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ రహదారి నిర్మాణ పనుల... అడ్డంకులను పరిష్కరించండి



తిరుపతి కలెక్టరేట్, మే 21 ప్రభాతవార్త: కడప రేణిగుంట జాతీయ రహదారి నెం.716 నిర్మాణ పనులకు సంబంధించి ఎదురవుతున్న ప్రధాన సమస్యలు, అడ్డంకులపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిధిలోని జాతీయ రహదారి ప్రాధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.భూసేకరణ సమస్యలు పెండింగ్‌లో ఉండటం వల్ల పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని ప్రాజెక్ట్ డైరెక్టర్ వివరించగా, జిల్లా కలెక్టర్ వెంటనే ఆర్డీఓలు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి రెండు వారాల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న చెట్ల తొలగింపు పనులను వేగవంతం చేసి, కాంట్రాక్టర్ రహదారి విస్తరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి డీఎఫ్ఓకు కలెక్టర్ సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్, ఆర్డీఓతిరుపతి, ఆర్డీఓశ్రీకాళహస్తి, ఎన్‌హెచ్ఏఐ తిరుపతి ప్రాజెక్ట్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమించానన్నాడు...పెళ్ళి చేసుకున్నాడు

**-ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు -చివరకు ప్రియురాలితో జంప్ అయ్యాడు-పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు**



పలమనేరు, మే 21 ప్రభాతవార్త: పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరు వద్ద వైఎస్ఆర్ కాలనీలో చాందినీ అనే మహిళ గురువారం తన ఇద్దరు పిల్లలతో వెళ్ళి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే కాలనీలో నివాసమున్న సల్మాన్ అనే ఆటో డ్రైవర్ చాందినీని ప్రేమించానన్నాడు. పెద్దలను కాదని 2016లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఐతే సల్మాన్ ఇటీవల మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. రహస్యంగా సాగుతున్న వీరి నిర్వాకం చివరకు బట్టబయలైంది. దీంతో చాందిని తన భర్తను నిలదీసింది. ఐతే భార్య మాట వినని సల్మాన్ రెండు రోజుల క్రితం తన ప్రియురాలితో జంప్ అయ్యాడు. తనకు జరిగిన అన్యాయంపై చాందినీ పోలీసులను ఆశ్రయించింది. తనకు న్యాయం చేయాలని విన్నవించింది. తన భర్త దాదాపు రూ. 20 వేలు అప్పులు చేసి వెళ్ళిపోయాడని. తాను ఎలా తీర్చాలని, పిల్లలను ఎలా పోషించాలని వాపోయింది.

**ఆధునిక భారత పురోగతిలో**

## రాజీవ్ గాంధీ ఆలోచన విధానం చెరగని ముద్ర

**-గౌడపేరు చిట్టిబాబు**



తిరుపతి,మే 21ప్రభాతవార్త: నేటి ఆధునిక భారత పురోగతిలో రాజీవ్ గాంధీ గారి ఆలోచన విధానం చెరగని ముద్ర వేసిందని తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు చెప్పారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి పాత మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు,పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్ ,ఎన్ఎస్ యుఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగం కన్వీనర్ బోయన నరేంద్రబాబు, ఎస్టీ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి ఆమూరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు గొడుగుచింత గోపి, పార్థసారధి రెడ్డి, ఎస్ టి విభాగం తిరుపతి అధ్యక్షుడు కొమరగిరి ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి జనసేన పార్టీ పగ్గాలు ఎవరికో!

(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)

లీడ్(శ్రీకాళహస్తి నియోజకవర్గం రాజకీయ పరిణతి చెందిన ప్రాంతం. అధికారంలో ఉన్నపుడు విచ్చలవిడిగా వ్యవహారించే నాయకుల తీరును గమనిస్తూ ఎన్నికల ఓటింగ్ రోజు మౌనంగా తన తీర్పును ఇచ్చేచైతన్యం కల్గిన నియోజకవర్గం ఇది, 2014లో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి బిజెపి, జనసేన, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు వేర్వేరుగా పోటీ చేసారు. ప్రస్తుతం కూటమిగా ఉన్నా ఏ పార్టీకి ఆ పార్టీ నాయకత్వం తమ పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేసుకొనుటకు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన నియోజకవర్గ బాధ్యతలు ఎవరిని వరిస్తాయమే అంశంపై చర్చ మొదలైంది.) శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీ పరిస్థితి ఆయోమయంగా మారింది. క్షేత్ర స్థాయిలో వనన్ కళ్యాణ్‌కు ఫాలోయింగ్ ఉంది. 2019లో ఆ పార్టీ కోట వినూతను అభ్యర్థిగా నిలబెట్టింది. గెలుపు ఓటములు ఎలా ఉన్నా ఆ ఎన్నికల్లో విదేశాల్లో ఉంటున్న రేణిగుంటకు చెందిన మహిళా అభ్యర్థిగా, వినూత కోటను రంగంలో దించారు. ఆ ఎన్నికల్లో గ్లాసు గుర్తు జనాల్లో గుర్తింపు తెచ్చారు. అయితే తరువాత ఐదేళ్ళు బాధ్యత కల్గిన ప్రతిపక్షంగా అప్పటిలో అధికారంలో ఉన్న వైకాపా నాయకునిపై పోరాటం చేసారు. 2024 ఎన్నికల్లో కూటమిలో సర్దుబాటుల్లో తమకు సీటు వస్తుందని వినూత కోట ఆశించారు. కానీ వివిధ సమీకరణలతో ఈ స్థానం తెలుగుదేశం పార్టీని వరించింది, దాంతో వినూత కోట నిరాశకు గురయ్యారు. కూటమిలో గెలిచిన ఎంఎల్ఏతో సఖ్యతగా ఇమడలేక పోయారు. తరువాత చోటు చేసుకున్న ఓ సంఘటనతో పార్టీ వినూత కోటను సస్పెండ్ చేసింది. దీంతో నామినేటెడ్ పదవుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మెన్ పదవి జనసేన తరఫున ఎవరూ ఊహించని వ్యక్తిని వరించింది. కోర్టు కేసుల్లో ఇరుక్కున్న వినూత కోట మళ్ళీ పార్టీ అధిష్టాన వర్గానికి ఏం జరిగిందో వివరించినట్లు ప్రచారం జరిగింది. తనను అనవసరంగా కేసుల్లో మిత్రపక్షమే ఇరకబెట్టిందని తన గోడును పార్టీ అధిష్టావర్గం వద్ద వివరించారు.

### నియోజకవర్గ ఇన్‌చార్జి పగ్గాలు ఎవరికో?

శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వారికి భవిష్యత్తులు ఎన్నికల్లో శాసన సభ్యుడుగా పోటీ చేసేందుకు అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పగ్గాలు ఎవరిని వరిస్తాయో? అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే పార్టీ అధిష్టాన వర్గం తమ పరిధిలో రహస్యంగా నివేదికలు సేకరిస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఏం జరుగుతుందో సమగ్రంగా అధ్యయనం చేస్తున్నారు. ఈనేపథ్యంలో పార్టీ పలు అంశాలను పరిగణలోకి తీసుకుంటుంది. రాబోవు రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో నడపగల్గిన వ్యక్తి, అలాగే నేడు రాజకీయం నడపాలంటే ఆర్థిక స్థోమత సామాజిక వర్గం, పలువురితో సఖ్యతగా వ్యవహారించే వారికి సంబంధించి తమ పరిధిలో సర్వేలు జరుపుకుంటున్నారు. పార్టీ అధిష్టానంలో పార్టీ వ్యవహారాలను పూర్తిగా అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల ఎన్నికకు పలు నిబంధనలను రూపకల్పన చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు సభ్యుల కమిటిని ఏర్పాటు చేసారు. వీరు తమ వ్యక్తిగత సర్వేల ద్వారా పార్టీ పరిస్థితిని సేకరిస్తున్నారు. పార్టీలో ఆది నుంచి ఉన్న వారికి ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదులో నియోజకవర్గంలో ఎవరు అధికంగా నయోదు చేసారనే అంశం, ప్రజలకు సత్సంబంధాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. అయితే వీటితో పాటు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించే వారి ఆర్థిక స్థితి గతులను కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వాలు చేసిన వారిలో శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామానికి చెందిన నరేంద్ర ముందు వరుసలో నిలిచారు. ఇతను బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉన్నారు.

### ఆధ్యాత్మిక వాది డాక్టర్ హరిప్రసాద్?

జనసేన పార్టీలో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి డాక్టర్ హరిప్రసాద్ కూడా ఉన్నారు. గతంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ ఎంపికకు సంబంధించిన చర్చ వచ్చినపుడు ఆధ్యాత్మికవాది డాక్టర్ హరిప్రసాద్‌పేరు పరిశీలనకు వచ్చింది. అంతేకాక శ్రీకాళహస్తి నుంచి కొందరు ఇతర పార్టీల్లో ఇమడలేక కొనసాగుతున్న వారి పేర్లుకూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బిసిలకు చెందిన మిద్దెల హరి పార్టీలో చేరుతారనే ప్రచారం సాగుతుంది. ఇప్పటికే ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా ఉన్న కొట్టెసాయిప్రసాద్ తనకు అవకాశం వస్తే బాగుటుందనే ఆలోచనలో ఇటీవల పార్టీ సమావేశాల్లో పార్టీ అధినాయకుల కళ్ళలో పడటానికి ప్రయత్నించారు. వినూత కోటను పార్టీకి వివరణ ఇచ్చారు. మరి ఏం నిర్ణయం తీసుకున్నారో తెలలేదు.

స్థానిక సంస్థల ఎన్నికలే కీలకంగా...

మరో మూడు నాలుగు నెలల్లో పంచాయతీలు, ఎంపిటిసిలు, మున్సిపాలిటిల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ క్షేత్ర స్థాయిలో పటిష్టం చేసుకోవాలని అధిష్టానం కసరత్తు చేస్తుంది. ఒక వేళ కూటమిలో సర్దుబాట్లు ఉన్నా ఈ సారి పార్టీ కొన్ని కీలక నియోజకవర్గాలను ఎన్నిక చేసుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. మరి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి గట్టి ప్రయత్నం జరుగుతున్నట్లు కార్యకర్తల్లో చర్చ జరుగుతుంది.

# తిరుపతి డివిజన్

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం



**తిరుపతి విద్య మే 21 ప్రభాత వార్త**

తిరుపతి జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ (ఐపీఏఈ) మే-2026 థియరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రాంతీయ తనిఖీ అధికారి (ఆర్ఐఒ) రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 66 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఉదయం సెషన్‌లో జనరల్ కోర్సుకు 5,324 మంది విద్యార్థులకు గాను 5,005 మంది హాజరుకాగా, 319 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ కోర్సులో 145 మందికి గాను 135 మంది హాజరై, 10 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మొత్తం ఉదయం సెషన్‌లో 5,469 మందికి గాను 5,140 మంది పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం సెషన్‌లో జనరల్ కోర్సులో 2,547 మందికి గాను 2,280 మంది హాజరై, 267 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. ఒకేషనల్ కోర్సులో 96 మందికి గాను 89 మంది హాజరై, 7 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మొత్తం మధ్యాహ్నం సెషన్‌లో 2,643 మందికి గాను 2,369 మంది పరీక్షలు రాశారని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు వంటి అవసరమైన ఏర్పాట్లు కల్పించామని ఆర్ఐఒ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పర్యవేక్షణ నిర్వహించారని చెప్పారు.

## కేఎంఎం కార్యదర్శి అరుణ్ కుమార్ బర్త్‌డే వేడుకలు



**తిరుపతి విద్య, మే 21 ప్రభాత వార్త**

కేఎంఎం కళాశాలల కార్యదర్శి సాకే అరుణ్ కుమార్ జన్మదిన వేడుకలు తిరుపతిలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, స్నేహితులు, అభిమానులు అరుణ్ కుమార్‌ను కలిసి ఆత్మీయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీధర్ గుర్రంకొండ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది సంఘం ప్రతినిధులు, పయ్యావుల శ్రీహరి , అవిలాల ప్రాంత ప్రముఖులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు. వారు అరుణ్ కుమార్‌కు దుస్సాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యా రంగంలో అరుణ్ కుమార్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన తీసుకుంటున్న చర్యలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజ సేవలోనూ ముందుండి సేవలందిస్తున్నారని అభినందించారు. అరుణ్ కుమార్ మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి విద్యా రంగంలో విశేష కీర్తి సాధించాలని ఆకాంక్షి స్తూ అందరూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో సాగగా, పలువురు అభిమానులు, మిత్రులు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



**కేవీబీ పురం, మే 21 ప్రభాతవార్త:**

ఆధునిక భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా కేవీబీ పురంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం కేవీబీ పురం భారత్ గ్యాస్ కంపెనీ వద్ద రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకుడు, మాజీ ఎంపీపీ తెరణి ధనంజయలురెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచం ముంగిట నేడు అగ్రగామిగా దేశం ఉందంటే నాడు రాజీవ్ గాంధీ అమలు చేసిన సంస్కరణల పుణ్యమే, విద్య, సాంకేతిక, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి మూల స్తంభాలు, ఐటీ రంగానికి పితామహుడిగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారత్‌గ్యాస్ కంపెనీ లత, తులసి, గోపి, మౌలిక తదితరులు పాల్గొన్నారు.

## తుడా అభివృద్ధి పనులపై సమీక్ష



తిరుపతి కార్పొరేషన్, మే 18 ప్రభాతవార్త:

తుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి విజయవంతంగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా డాలర్స్ దివాకర్ రెడ్డి తుడా కార్యాలయంలో ఉన్నతాధికారులతో కలిసి ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తుడా వైస్ చైర్మన్ ఆర్. గోవింద రావుతో పాటు సంస్థకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంగా తుడా పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా, తుడాను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు గత ఏడాది కాలంగా తుడా యంత్రాంగం అంతా ఒక కుటుంబంలా శ్రమించారని, పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేయడంతో పాటు, పారదర్శకమైన సేవలను ప్రజలకు అందించగలిగాం, అని చైర్మన్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో చేపట్టబోయే ప్రణాళికలపై చైర్మన్ అధికారులకు దిశానిర్దేశం చేసి, సామాన్య ప్రజలకు ఇళ్ల స్థలాలు, లేఅవుట్ల అనుమతుల్లో మరింత పారదర్శకత, వేగం పెంచాలని ఆదేశించారు. వైస్ చైర్మన్ ఆర్. గోవిందరావు, అధికారులు చైర్మన్ కి ఘనంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

### మొక్కలు నాటిన దివాకర్ రెడ్డి

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి గురువారం తుడా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంపొందించడానికి, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి తుడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చైర్మన్ తెలిపారు. అందులో భాగంగానే ఈ మైలురాయిని స్వయంగా మొక్కలు నాటే కార్యక్రమంతో ప్రారంభించినట్లు పేర్కొని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడా ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్లానింగ్ అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాథుని దర్శించుకున్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం



కాణిపాకం, మే 21 ప్రభాతవార్త :

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గురువారం కానిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్నారు. కాణిపాకం దేవస్థానంలో 14.74 కోట్ల రూపాయల తో నూతనంగా నిర్మించిన వినాయక సదన్ బ్లాక్ 1 బ్లాక్ 2 గదులను మంత్రి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు వేర్వేరుగా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అతిథి గృహం నుంచి ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థానం చైర్మన్ వి. మణి నాయుడు, ఈవో కే పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పూజ సామాగ్రిని మంగళ వాయిద్యాలు నడుమ ఆలయంలోకి తీసుకువెళ్లి సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా మంత్రి రాం నారాయణరెడ్డి పూజ నిర్వహించారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలను, ప్రసాదాలను, స్వామి వారి జ్ఞాపకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో సాగర్ బాబు, రిటైర్డ్ ఈ ఈ వెంకటనారాయణ, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి, దేవాదాయ శాఖ తిరుపతి ఆర్ జె సి చంద్రశేఖర్ ఆజాద్, కర్నూలు డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఆలయ ఏఈవోలు ప్రసాద్, హరి మాధవరెడ్డి, ధనపాల్, ధనంజయ, రవీంద్రబాబు, సూపరిండెంట్ లు కోదండ పాణి, వాసు, చిత్తూర్ రూరల్ వెస్ట్ సి ఐ శ్రీధర్ నాయుడు, జడ్పిటిసి సుచిత్ర, బంగారుపాలెం ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, తవణంపల్లి సింగర్ విండో ప్రెసిడెంట్ అమరేందర్ నాయుడు, పలువురు టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు ఆలయ అధికారులు అర్చకులు వేద పండితులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలతో నిరసన



పుత్తూరు ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పుత్తూరు రూరల్, మే 21 ప్రభాతవార్త:

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పుత్తూరు ఆర్టీసీ డిపో ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం 2వ రోజు బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జె.పెరుమాళ్ హాజరై ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. పుత్తూరు డిపోలో ఉదయం 11 గంటలకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రకటించిన పలు ప్రధాన డిమాండ్లను ఉద్యోగులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని, మహిళలకు అమలు చేస్తున్న సున్నా టికెట్ విధానాన్ని పునఃసమీక్షించి మిగతా ప్రయాణికులకు సాధారణ టికెట్లు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలనికోరారు. అలాగే వేతన సవరణ కమిటీని వెంటనే నియమించి మధ్యంతర ఉపశమనాన్ని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలు, బకాయిలు, సెలవుల నగదీకరణ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేయడం, అన్ని విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయడం, పదవీ విరమణ చేసిన మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. ఇక ఉద్యోగులను ఈహెచ్ఎస్ పథకం నుంచి మినహాయించి గతంలో అమల్లో ఉన్న ఆర్టీసీ వైద్య సదుపాయాలను పునరుద్ధరించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై తమ ఐక్యతను చాటారు. కార్యక్రమంలో కడప జోనల్ కమిటీ మెంబరు ఆర్ముగం, పుత్తూరు డిపో అధ్యక్షుడు ఎస్.సుందరం, డిపో కార్యదర్శి ఎం.శివకుమార్, సీసీఎస్ డెలిగేట్ ఎస్.ధనరాజ్, జాయింట్ సెక్రటరీ ఇ.నాగరాజు, డిపో అడ్వయిజర్లు ఎస్.బి.సెల్వం, కె.సి.రాయులు, జిల్లా నాయకులు ఆర్ముగం, గ్యారేజ్ డి.హేమంత్‌కుమార్, గ్యారేజ్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి వి.దొరబాబు, సీనియర్ నాయకులు ఆర్.హేమంత్‌రెడ్డి, ఎన్.భాస్కర్, రిటైర్డ్ ఉద్యోగులు గుప్తా, కె.ఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ శాస్త్రంలో దామిశెట్టి సుభాషిణికి డాక్టరేట్



యూనివర్సిటీ(తిరుపతి), మే 21ప్రభాతవార్త:

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని డి. సుభాషిణికి డాక్టరేట్ అందజేశారు. న్యాయ శాస్త్ర విభాగపు ప్రొఫెసర్ టి. సీతా కుమారి పర్యవేక్షణలో " గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ఇన్ ఇండియా ఎ క్రిటికల్ ఎనాలిసిస్ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని డి . సుభాషిణి సమర్పించారు. అందుకుగాను ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.



కాణిపాకం ఆలయంలో స్వామివారికి పూజా ద్రవ్యాలను తీసుకు వెళుతున్న రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

## శ్రీసిటీని సందర్శించిన మహారాష్ట్ర విద్యార్థులు

సత్యవేడు, మే 21 ప్రభాతవార్త:

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చొరవతో ఏక్‌భారత్ శ్రేష్ట్ భారత్‌యువ సంఘం కార్యక్రమంలో భాగంగా మహా రాష్ట్రంకు చెందిన వివిధ విద్యాసంస్థల నుంచి 50మంది విద్యార్థులు, అధ్యాపకులు గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వేగవంతమైన పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కల్పించడం లక్ష్యంగా మహారాష్ట్రంలోని 29 జిల్లాల నుంచి పర్యటనకు విచ్చేసిన విద్యార్థులకు శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టర్ రిలేషన్స్) రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి చర్చల్లో పాల్గొన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రసన్నారెడ్డి, దేశ సమైక్యతను చాటిచెబుతూ దేశంలోని విభిన్న ప్రాంతాలు, సంస్కృతులు, సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసే ఈ మంచి కార్యక్రమానికి శ్రీసిటీని ఎంపిక చేయడం తాము గౌరవ ప్రదంగా భావిస్తున్నామన్నారు. వెనుకబడిన ప్రాంతం నుంచి అద్భుత ఆర్థిక కేంద్రంగా శ్రీసిటీ పరిణామం చెందిన తీరును వివరిస్తూ, ప్రస్తుతం 31 దేశాలకు చెందిన 250కిపైగా సంస్థలకు నిలయంగా ఆటో మొబైల్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ, ఇంజనీరింగ్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని తెలిపారు. పలు ఏసీ కంపెనీల ఏర్పాటుతో ఇండియా కూల్ క్యాపిటల్‌గా మారిందన్నారు. 80 వేల కోట్ల పెట్టుబడులు, 60 వేల కోట్లకు పైగా ఎగుమతుల సామర్థ్యంతో మేక్ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్ లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేస్తూ 85 వేల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నాయని, అందులో దాదాపు సగం మంది మహిళలేనని తెలిపారు. యువ సంఘం కార్యక్రమంపై స్పందిస్తూ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనపై శ్రీసిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ముఖాముఖిలో ఎంతో ఆసక్తితో శ్రీసిటీ సామాజిక వసతులు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, సుస్థిరత, ఉపాధి అవకాశాలు తదితర పలు అంశాలను తెలుసుకున్న విద్యార్థులు, అనంతరం శ్రీసిటీ పరిసరాలను తిలకించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుపతి ఐఐటీని ఈ కార్యక్రమానికి నోడెల్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తించారు.




శ్రీసిటీని సందర్శించిన అధ్యాపకులు, విద్యార్థులు

# తిరుపతి డివిజన్

## భూమన కుటుంబాన్ని... తరిమికొట్టే రోజులు దగ్గరలోనే

### శాప్ చైర్మన్ రవినాయుడు



తిరుపతి హెల్త్, మే 21 ప్రభాతవార్త: ప్రశాంతంగా ఉన్న తిరుపతిలో అరాచక వాదులకు, ఉన్మాదులకు, మహిళలను ఇబ్బందులను పెట్టేవారిని వదిలిపెట్టేది లేదని, భూమన కుటుంబాన్ని తిరుపతి నుంచి తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమన కుటుంబ బాధితులు ముందుకు రావాలని, వారికి అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చి తీరుతామన్నారు. జేబీ శ్రీనివాసులు మాట్లాడుతూ గంజాయిని స్మగ్లింగ్ చేసే పెద్ద గంజాయి రెడ్డి భూమన కరుణాకర్ రెడ్డి అయితే, చిన్న గంజాయి రెడ్డి భూమన అభినయరెడ్డి అని ఆరోపించారు. తిరుపతిలో అల్లర్లు చేయాలని భూమన కుటుంబం ప్రయత్నిస్తోందని, ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాపై పనిగట్టుకుని వైసిపి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని భూమన ఇళ్ళు మెత్తం కబ్జానే అని ఆరోపించారు. స్థల యజమానులను బెదిరించి, భయపెట్టి భూమన కుటుంబం స్థలాలను కబ్జా చేశారని, తనపల్లె దగ్గర భూమన అభినయరెడ్డి గుర్రపుస్వారీ కోసం 5 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. భూమన భూకబ్జాల బాగోతాన్ని త్వరలోనే బయటపెడతామని, రౌడీయిజం చేస్తుంది ఎవరో ప్రజలకు తెలుసునన్నారు. రోడ్ల నిర్మాణం పేరుతో టిడిఆర్ బాండ్లలో భూమన అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పులిగోరు మురళిక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తిరుపతి, తిరుమల పవిత్రతను భూమన కుటుంబం దెబ్బతీస్తోందన్నారు. గతం మర్చిపోయి భూమన కుటుంబం కూటమి నేతలపై బురద జల్లుతున్నారన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి ఏ ఎన్నికలను సజావుగా జరగనివ్వలేదన్నారు. భూమన కుటుంబం అబద్ధపు మాటలను ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన బాధ నుంచి ఇంకా భూమన కుటుంబం కోలుకోలేదన్నారు. గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్ మాట్లాడుతూ నాపై భూకబ్జా ఆరోపణలు చేశారని, ఒక్క సెంటు భూమి కూడా నేను కబ్జా చేయలేదని, భూకబ్జా చేసినట్లు నిరూపిస్తే ఆ స్థలాన్ని వారికే రాసిస్తానన్నారు. భూకబ్జాకు పాల్పడలేదని గంగమ్మ ఆలయంలో ప్రమాణానికి నేను సిద్ధం అని చెప్పారు.

## ఆదివాసీలను అక్కడి నుండి తరిమేస్తున్నారు

### కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



తిరుపతి హెల్త్, మే 21 ప్రభాతవార్త: మాజీ ప్రధాన మంత్రులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ లాగా ప్రధాని నరేంద్ర మోడి విద్యావేత్త కాదని,దేశ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు చింతామోహన్ కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ హెచ్చరించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ క్యాంప్ బెల్ అనేది అండమాన్ దగ్గర ఉన్న ఒక ప్రాంతం అని, అక్కడ 4000 మంది ఆదివాసీలు ఉన్నారన్నారు. సుమారుగా 300 నుంచి 400 సంవత్సరాలు వయసు వున్న చెట్లు ఉన్నాయని,వాటిని అదానీ నరికేస్తున్నారని పేర్కొన్నారు. సిపోర్టులు, ఎయిర్ పోర్టు అక్కడ నిర్మిస్తున్నారన్నారు.అక్కడ ప్రధాని మోడీ మిత్రుడు అదానీ ఒక దేశాన్ని సృష్టించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని, 40 వేల విల్లాలు అదానీ నిర్మిస్తున్నారన్నారు. అందుకు పది లక్షల ఎకరాల భూములు గిరిజనులని తెలిపారు. ఆదివాసీలను అక్కడి నుండి తరిమేస్తున్నారని వాపోయారు.ప్రధాన మంత్రి మోడీకి చదువు, సంధ్య లేదు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ లాగా ప్రధాని విద్యావేత్త కాదు అని ఎద్దేవా చేశారు. ప్రధాని తన మిత్రుడు అదానీకి పూర్తి పర్మిషన్లు ఇచ్చాడన్నారు. ఇది దేశానికి ప్రమాదకరం అని,దేశ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.. భారతదేశ స్వరూపాన్ని, చరిత్రను, ప్రగతిని దెబ్బతీసే విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

**- టీటీడీ శానిటేషన్ కాంట్రాక్టుల్లో అవినీతి**

టిటిడి శానిటేషన్ భాగంలో అవినీతి రాజ్యమేలుతోందని, కాంట్రాక్టర్లతో లాలూచి పడి వారి నుంచి ముందే డబ్బులు తీసుకుంటున్నారన్నారని విమర్శలు చేశారు. రెండు రోజుల్లో టెండర్లు ప్రక్రియ ముగించారని, ఇందులో ప్రభుత్వ పెద్దల ప్రమేయం వుందని ఆరోపించారు. క్యాసీ, బీసీ, అనే కొత్త పద్ధతిని తీసుకొచ్చారు. ఎస్సీ, బీసీలకు కాంట్రాక్టు వర్కులు దక్కకుండా అన్యాయం చేశారన్నారు. అలాగే టిటిడి హెల్త్ విభాగంలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి పదివేల రూపాయలు వేతనం ఇస్తూ, 14 గంటలు పాటు కార్మికుల చేత పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత భాగ్యనగరం తెలంగాణకు వెళ్ళిందని,టిటిడి మనకు మిగిలిందని, ఏపీకి ఆధ్యాత్మిక కేంద్రం అని ముఖ్యమంత్రి అన్నారని గుర్తు చేశారు. అయితే ఆధ్యాత్మిక కేంద్రం కాస్త అవినీతి కేంద్రంగా తయారయిందన్నారు. ట్రైడెంట్, ఒబెరాయ్, దేవలోక్ అనే మూడు సంస్థలకు ఒకొక్క సంస్థకు 30 ఎకరాల చొప్పున, 90 ఎకరాలు టిటిడి భూములు ఇచ్చారన్నారు. వారి దగ్గర నుంచి వేల కోట్ల రూపాయలు ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. 90 ఎకరాలు భూ కేటాయింపులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమలలో పది హోటళ్లు ఇచ్చారని, ఏ ప్రాతిపదికన ఇచ్చారు? ఎవరికి ఇచ్చారు? ఇడ్లీ, దోశలు తయారీకి పూనా నుంచి ఇక్కడకు రావాల్సిన అవసరం ఉందా? తిరుపతి స్థానికులు అర్హులు కారా? అని ప్రశ్నించారు. అదే విధంగా 12వ పీఆర్సీ అమలు చేయాలని కోరుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడానికి వీలు లేదన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు, గ్యాస్ బస్సులు వద్దని, ఉన్న బస్సులను వాడండని సూచించారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రపంచ యుద్ధాన్ని ఆపిన గొప్ప ధీరుడు అని చింతామోహన్ కొనియాడారు. ప్రెస్ కాన్ఫరెన్స్ కు ముందు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి చింతా మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్, రావణ్, శాంతి యాదవ్, తేజోవతి, ముని శోభ, సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## అమర హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం

రేణిగుంట,మే 21ప్రభాతవార్త: తిరుపతి కరకంబాడి వద్ద ఉన్న అమర ఆస్పత్రి యాజమాన్యం రెండవ ఉచిత ఒపీనియన్ క్లినిక్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా అనుభవజ్ఞులైన .. సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ రవికుమార్ మోకాలి హిప్ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు,.సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ కాటం కృష్ణయ్య, మోకాలి హిప్ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు మాట్లాడుతూ టికెఆర్, టిహెచ్ఆర్ కు సంబంధించిన సెకండ్ ఒపీనియన్ సేవలను ఇప్పుడు సులభంగా పొందవచ్చని తెలిపారు. రోగులు తమ స్కాన్‌లు, ఎక్స్‌రేలు మరియు వైద్య రిపోర్టులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి, నిపుణుల అభిప్రాయం మరియు తగిన వైద్య సూచనలు పొందవచ్చని వారు పేర్కొన్నారు. ఈ సేవ ద్వారా అవసరంలేని శస్త్రచికిత్సలను నివారించడంతో పాటు, సరైన చికిత్సపై స్పష్టత లభిస్తుందని తెలిపారు.అమర హాస్పిటల్ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో భాగంగా ఈ ఉచిత సెకండ్ ఒపీనియన్ క్లినిక్‌ను ప్రారంభించిందని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. అమర హాస్పిటల్ చైర్మన్ డా. ప్రసాద్ గౌరినేని గారు మరియు మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి గౌరినేని గార్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిబిఒ వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ రీనా,పిఆర్ఓ మునినాథం హేమ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు కుప్పం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

### కమీషనర్ శ్రీనివాసరావు

కుప్పం, మే 21 ప్రభాతవార్త: కుప్పం మున్సిపాలిటీ సాధారణ సభ సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేదీ మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ అధ్యక్షతన కుప్పం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని కుప్ప మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుతం కుప్పం మున్సిపాలిటీలో ఉన్న 25 వార్డులను 32 వార్డులుగా విభజించే అంశంపై చర్చించడం జరుగుతుందన్నారు. వార్డుల విభజనపై మున్సిపల్ కౌన్సిల్ సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## మున్సిపల్ పార్కులకు మహార్ధశ

**-శ్రీరామ్‌నగర్ పార్కుకు రూ.20లక్షలు**
**- ఎన్‌టిఆర్ పార్కును అభివృద్ధి చేస్తాం : మునిసిపల్ కమిషనర్**

శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిమున్సిపల్ పరిధిలోని పార్కులను గత కొంత కాలంగా నిర్లక్ష్యం చేసారు.అయితే ప్రస్తుత కమిషనర్ భవాని ప్రసాద్ కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. స్వతహాగా వ్యాయామం చేసే ఆయన పార్కులకు మహార్ధశ కల్పించుటకు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని దశాబ్దాలుగా మురుగునీటి గుంటగా చెత్తకుప్పలతో నిండిన శ్రీరామనగర్‌లోని పార్కును గుర్తించి అక్కడ దశల వారిగా అభివృద్ధి పరచుటకు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ పార్కు అభివృద్ధికి మొదటి దశగా రూ.20లక్షలు కేటాయించినట్లు కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు.గతంలో శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నది ఒడ్డున ఒక పార్కు ఉండేదన్నారు. అయితే అది శిథిలమైందన్నారు. అలాగే శ్రీరామనగర్ కాలనీలో ఓ అందమైన పార్కు ఉన్నట్లు రికార్డుల్లో ఉందని అయితే అక్కడ పరిశీలిస్తే పరిస్థితి దారుణంగా ఉండటం గమనించి ఆహ్లాదాన్ని అందించే పార్కుల దుస్థితిపై దృష్టి సారించామన్నారు. ఈ నేపథ్యంలో మొదటి దశలో శ్రీరామనగర్ కాలనీలో రూ.20లక్షలతో ఆధునీకరిస్తున్నట్లు కమిషనర్ వివరించారు. ఇక్కడ మొదటిగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అంతేకాక ఇక్కడ చక్కటి పూల చెట్లు, అలాగే పచ్చిక లాన్‌తో పాటు పిల్లలకు ఆటవస్తువులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే ఎన్‌టిఆర్ పార్కులో పిల్లల ఆటవస్తువుల మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వృద్ధులకు జిమ్ చేయటానికి పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు. ఇక హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న పార్కులో బెటర్ గా ఉన్నాయన్నారు. కానీ అక్కడ కూడా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. మున్సిపల్ పరిధిలో తమకు ఉన్న నిధుల్లో కొంత ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



శ్రీరామనగర్ కాలనీలోని పార్కు దృశ్యం

## కాపుగున్నేరిలో గడ్డివామి దగ్ధం



శ్రీకాళహస్తి రూరల్,మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి గ్రామానికి చెందిన పాడి రైతు అంజయ్యకు సంబంధించిన గడ్డివామి అగ్ని ప్రమాదానికి గురైంది. అయితే చుట్టుపక్కల వారు మంటలను ఆపుటకు ప్రయత్నించారు.కానీ సాధ్యం కాలేదు. దాంతో శ్రీకాళహస్తిలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు.వారు అక్కడకు చేరుకునే లోపల గడ్డివామి పూర్తిగా మంటలకు ఆహుతైంది.దీని విలువ సుమారు రూ.75వేలు ఉంటుందని బాధితుడు అంజయ్య వివరించారు. అసలే కష్టాల వ్యవసాయం సాగిస్తున్న తరుణంలో అగ్ని ప్రమాదం తనను కకుంగదీసిందని వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

## గుడిమల్లం ఆలయానికి విరాళం



ఏర్పేడు,మే 21 ప్రభాతవార్త: ఏర్పేడుమ ండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయానికి భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి. ఆలయానికి కుంబాభిషేకం జరిపిన తరువాత భక్తుల తాకిడి పెరుగుతుంది. ఈనేపథ్యంలో గురువారం ఆలయాన్ని సందర్శించిన వరద రాజులు, లతాలు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరినాయుడు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనం తరువాత వేదపండితులు వంశీకృష్ణ వారికి ఆశీర్వదించారు. తరువాత వారు ఇక్కడ నిర్వహించే నిత్యాన్నదా పథకానికి రూ.10వేలు విరాళంగా అందించారు.వారికి ఆలయ మర్యాదలతో చైర్మెన్ గిరినాయుడు, ఇఓ మునిశేఖర్‌లు ఆశీర్వదించారు. తీర్థ ప్రసాదాలు అందించారు.

## గురుదక్షిణామూర్తికి షోడషాభిషేకాలు



శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన క్షేత్ర పాలకుడు గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు,హోమాలు, అభిషేకాలు ఆలయ ఉప ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. మహిమాన్విత దివ్యక్షేత్రంలో వెలసిన గురువు దక్షిణామూర్తికి గురువారం పండగలా పూజలు నిర్వహించటం ఈ దివ్యక్షేత్రంలో ఆచారంగా వస్తుంది. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు. ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు. అనంతరం పాలు, పెరుగు, పంచామృతం, చందనం, పసుపు,తేనె, నారికేళ్ళ జలంతో అభిషేకాలు జరిపారు. తరువాత సుగంధ పరిమళ పుష్పాలతో, స్వర్ణాభారణాలతో శోభాయమానంగా అలంకరించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశులు హాజరై ఆశీర్వచనాలు అందుకున్నారు.

## రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించిన నేతలు



శ్రీకాళహస్తి మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డి ఆధ్వర్యంలో భారతదేశ దివంగత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాళ హస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయక ర్తతలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా అడుగులు వేయించి, దేశ అభివృద్ధికి పునాదులు వేసి, ప్రపంచీకరణకు నాంది పలికి భారతదేశానికి సాంకేతిక పితామహుడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు జ్యోతిశ్వర్ నాయక్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు, మహేష్, చిరంజీవి, మాస్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి మోటారుకు మరమ్మతులు



ఏర్పేడు, మే 21 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ రాజుల కండ్రిగ గ్రామం నందు 20 రోజులుగా మోటారు మరమ్మతులకు అయిందని గ్రామస్తులు ఏర్పేడు మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడుకి రాజుల కండ్రిగ టిడిపి క్లస్టర్ గుండ్రాజు మురళి కి చరవాణి ద్వారా ఫిర్యాదు చేశారు. క్లస్టర్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు ఎంపీడీవో ఫిర్యాదు చేసి పంచాయతీ సెక్రెటరీ గాయత్రి ఆదేశాల ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, మెకానిక్ ప్రసాద్ వెంటనే స్పందించి మోటారుకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామస్థులు రామక్రిష్ణ, సరస్వతి, భారతి, మీనా, వంశీ మండల అధ్యక్షులుపేరం నాగరాజు నాయుడుకి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వార్తకు స్పందన

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలించిన అధికారులు



తొట్టంబేడు,మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మునిసిపాలిటిలోని 11 వార్డు ముత్యాలమ్మగుడివీధిలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గటం జనం పడుతున్న ఇబ్బందిని వార్త దినపత్రికలో గురువారం 'విద్యుత్ కోతతో అల్లాడుతున్న జనం' అనే శీర్షికన ప్రచురితమైంది. దాంతో ఇక్కడ సమస్యకు మూలం ఏమిటో క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించారు. గతంలో 100 కివిల ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసేవారు. అయితే ఇక్కడ లోడ్ చాలటం లేదని 160కెవి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసారు. అయితే ప్రతి ఇంటికి ఏసిలు ఏర్పాటు చేసుకోవటంతో లోడ్ చాలటం లేదని విద్యుత్ అధికారులు వివరణ ఇచ్చారు. ముత్యాలమ్మగుడివీధిలో అంతరాయానికి కారణం కండెన్సర్లు దెబ్బతినటం అన్నారు. గురువారం ముత్యాలమ్మగుడివీధికి క్షేత్ర స్థాయిలో విద్యుత్ అధికారులు ఎడిఇ సుధాకర్, ఎఇఇ శివప్రసాద్,లైన్ మెన్ మునస్వామి, తమీమ్‌లు పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు ఎడి సుధాకర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో లోడ్ చాలటంలేదని గుర్తించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయుటకు ఇబ్బందిగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలోని చిన్నమసీదు వీధి,వివిఎంసి సర్కిల్, ఎంఎం వాడ,12వ వార్డు, భాస్కరపేట, సుబ్రమణ్యం స్వామి గుడి వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు (100కెవి) అమర్చినట్లు వివరించారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు స్థానికులు సహకరించటం లేదని వివరించారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## వికృతమాల జాతరలో ఎంఎల్‌ఏ



ఏర్పేడు,మే 21 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని వికృతమాల గ్రామంలో జాతర సందర్భంగా శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం ఉదయం అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశం కార్యకర్తలు ఎంఎల్‌ఏ జన్మదిన ముందస్తు సంబరాలను ఏర్పాటు చేసారు. సుధీర్‌రెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు.ఆయన చేత కేక్ కట్‌చేయించారు.మండలంలోని పలు గ్రామాల్లో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి.ఈ నేపథ్యంలో ఒక్కక్క చోట ఒక్కొక్క తీరులో నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాలను మాజీ జడ్‌టిపిసి పేరం ధనంజయులు నాయుడు,మాజీ అధ్యక్షుడు పూల హేమాక్షి రాయల్ తదితరులు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.

## భెల్ పరిశ్రమలో చోరీ...అదుపులో ఇద్దరు

శ్రీకాళహస్తిరూరల్,మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం వద్ద ఏర్పాటు చేసిన భెల్ పరిశ్రమలో దొంగలు పడుతున్నారు.ఇక్కడ భెల్ పరిశ్రమ పని చేయకపోవటంతో దొంగల సామ్రాజ్యంగా మారింది. దొరికి నోళ్ళకు దొరికినంత అన్నట్లు దొంగలించుకుపోతున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కొంత మంది యువకులు ఓ ఆటోలో వెళ్ళి ఫ్యాక్టరీలోని మోటార్లు,రాడ్‌లు, ఇనుప సామగ్రిని తరలిస్తుండగా మన్న వరం గ్రామస్తులు గుర్తించి అదుపులో తీసుకున్నారు.వచ్చిన వారిలో కొందరు పరారు కాగా ఇద్దరిని అదుపులో తీసుకున్నారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు అప్పగించారు. సిఐ ఇబ్రహీం ఆదేశాలతో ఎస్‌ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదుపులో తీసుకున్న వారు చెర్లోపల్లికి చెందిన మునికిరణ్(25),తొట్టంబేడు మండలం గౌడమాలకు చెందిన నీలం వెంకటేష్(26)లను అదుపులో తీసుకున్నారు. పరారిలో ఉన్న వారికోసం గాలిస్తున్నట్లు వివరించారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడుబొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఎలాంటి ఆర్భాటాలు చేయవద్దని ప్రకటించారు.ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు మాజీ శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు డైరెక్టర్‌బాలు డిల్లిబాబు సామాజిక కార్యక్రమాలను చేపట్టారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తన జన్మదిన సందర్భంగా ఆర్భాటాలు వద్దని సంబరాలు వద్దని ఆదేశించారన్నారు.ఆయన సూచనల మేరకు తమ ప్రాంతంలో చదువుకునే విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు డివి నారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, క్లస్టర్‌ఇ న్‌చార్జి కంటారమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏను కలసిన టోకు వ్యాపారి



శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ముందస్తు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. పట్టణంలోని టోకు వ్యాపారి పొట్టి రాజా,పొట్టి యువలు ఎంఎల్‌ఏకు వెంకటేశ్వర స్వామి పటాలను అందించారు. జన్మదిన సందర్భంగా ఎంఎల్‌ఏ అందుబాటులో ఉండటం లలేదని తెలిసిన కొందరు అభిమానులు ఆయనకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.ఈ నేపథ్యంలో టోకు వ్యాపారి ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు. రాబోవు రోజుల్లో మరెన్నో పదవులు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు.

## తిరుపతి బస్ స్టేషన్లలో... నాణ్యమైన సేవలపై దృష్టి



తిరుపతి రవాణ, మే 21 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి బస్ స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కీలక సమీక్ష సమావేశం జరిగింది. డిప్యూటీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ యం. జగదీష్ అధ్యక్షతన స్టాల్ యజమానులు, టాయిలెట్ కాంట్రాక్టర్లతో ఈ సమావేశం నిర్వహించారు.బస్ స్టేషన్లలో ప్రయాణికులకు మంచి సేవలు అందించి పాజిటివ్ పర్సెప్షన్ పెంచడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రయాణికుల నుండి వచ్చిన ఫిర్యాదులపై సమీక్ష చేశారు. కొన్ని స్టాళ్లలో ఎం ఆర్ పి కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు, అనుమతి లేని వస్తువుల విక్రయం, ఆక్రమణలు, నిషేధిత వస్తువుల అమ్మకం వంటి అంశాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే టాయిలెట్లలో నిర్ణయించిన రుసుము కంటే అదనపు వసూళ్లపై హెచ్చరించారు.డిప్యూటీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ మాట్లాడుతూ బస్ స్టేషన్లు ప్రజల సేవా కేంద్రాలని, ప్రయాణికుల సంతృప్తే ముఖ్యమని తెలిపారు. ప్రతి లైసెన్సీ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.స్టాల్ యజమానులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఎంఆర్పీ ధరలకే వస్తువులు అమ్మాలి, అనుమతి ఉన్న వస్తువులనే విక్రయించాలి, నిషేధిత వస్తువుల అమ్మకం పూర్తిగా నిలిపివేయాలి అన్నారు. అలాగే ఆక్రమణలు చేయరాదని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తడి, పొడి చెత్త కోసం వేర్వేరు డబ్బాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో మంచి నాణ్యత గల ఆహారం మాత్రమే విక్రయించాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని తెలిపారు.టాయిలెట్ కాంట్రాక్టర్లకు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నిర్ణయించిన రుసుము మాత్రమే వసూలు చేయాలి, అదనపు డబ్బులు తీసుకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బస్ స్టేషన్లలో మెరుగైన వాతావరణం కలిగితే సంస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి. విశ్వనాథ్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె.సి.జి. భాస్కర్ తదితర అధికారులు, స్టాల్ యజమానులు , టాయిలెట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.